శ్రీ వేదాంత దేశికులు రచించిన

దయాశతకం

- తాత్పర్యంతో





ప్రచురణ
ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి - 2011

దయాశతకం (తాత్పర్యంతో) - శ్రీవేదాంతదేశికులు

ప్రచురణ : ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్, తి.తి.దే., తిరుపతి

వెల : అమూల్యము.

మొదటి ముద్రణ : 2011

ప్రతులు : 2000

ప్రకాశకులు :

శ్రీ ఎల్.వి. సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్.
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి - 517 507

ముద్రణ :

తి.తి.దే. ముద్రణాలయం
తిరుపతి-517 507

నివేదన

శతాధిక గ్రంథకర్తలు, అద్వితీయ మేధాపాండితీ సంపన్నులు అయిన శ్రీవేదాంత దేశికులు శ్రీనివాసుని దయాగుణవైభవాన్ని అందంగా స్తుతిస్తూ, దయాశతకమనే 108 శ్లోకాలను కలిగిన ఒక కమనీయమైన స్తుతిని వెలయించారు. ఇందులో శ్రీవేంకటేశ్వరుని దయాగుణవైభవం వివిధంగా, విలక్షణంగా కీర్తింపబడింది. శ్రవణసుభగాలైన శబ్దవిన్యాసాలతో, సహృదయ హృదయ రంజకాలైన వివిధార్థస్ఫురణలతో విరాజిల్లే ఈ స్తుతియొక్క వైభవం వాచామగోచరం. సహృదయపండితహృదయైకవేద్యం.

ఇందులో రస్యరమణీయాలైన పలు వేదాంతార్థాలు ఇమిడియున్నాయి. అడుగడుగునా సాహిత్య మధురిమ జాలువారుతుంది. ఇటువంటి విశిష్టమైన దయాశతకాన్ని తాత్పర్యసహితంగా ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్ ఆస్తిక పాఠకులకు అందజేస్తున్నది. ఈ స్తుతికి వ్యావహారిక భాషలో తాత్పర్యాన్ని సిద్ధం చేసిన ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి డా॥ ఈ.ఏ. శింగరాచార్యులు అభినందనీయులు. ఇంతకు ముందే ప్రాజెక్ట్ ద్వారా రఘువీరగద్యం, గరుడ దండకం, హయగ్రీవస్తోత్రం, శ్రీసుదర్శనాష్టకం, శ్రీషోడశాయుధస్తోత్రం అనే దేశిక స్తుతులు వివరణ సహితంగా ముద్రింపబడ్డాయి. పలువురి పండితుల, సామాన్య పాఠకుల ప్రశంసలను పొందాయి. అదేవిధంగా ఈ తాత్పర్యంతో కూడిన ఈ దయాశతకప్రచురణకూడా పండితులను, సామాన్యపాఠకులను ఆనందింపజేస్తుందని అభిప్రాయపడుతున్నాను. ఆస్తికులైన పాఠకులను ఈ గ్రంథాన్ని చదివి ఆనందించవలసినదిగా సాదరంగా ఆహ్వానిస్తున్నాను.

ఇట్లు

శ్రీ ఎల్.వి. సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్.
కార్యనిర్వహణాధికారి, తి.తి.దే.

ముందుమాట

భగవానుడైన శ్రీమన్నారాయణుడు తన కల్యాణగుణాలను ప్రకాశింపజేస్తూ వేంచేసి ఉండే పలు దివ్యక్షేత్రాలలో శ్రీవేంకటాచలం ప్రముఖమైనది. అచట వెలసిన శ్రీవేంకటేశ్వరుడు కలియుగ ప్రత్యక్షదైవంగా, భక్తులకు కొంగుబంగారంగా కీర్తింపబడుతున్నాడు. **"కలౌ వేంకటనాయకః"** అనే సూక్తి కలియుగంలో వేంకటేశ్వరుని ప్రాధాన్యాన్ని, ప్రాముఖ్యాన్ని వెల్లడిస్తున్నది. శ్రీవైకుంఠంలోని శ్రీమన్నారాయణుని క్రీడాపర్వతం గరుడునిచే భూమికి తీసికొని రాబడినదని, అది తిరుమలగా రూపొందిందని వేంకటాచలమాహాత్మ్యం పేర్కొన్నది.

భగవానుని కల్యాణగుణాల ప్రకాశం, వికాసం పరమపదంలోని పర రూపంలో కంటే భూమిలో అర్చామూర్తిగా వేంచేసి ఉండే రూపంలో అధికమని వేదేతిహాస పురాణవాఙ్మయం, దివ్యసూరుల ప్రబంధాలు, పూర్వాచార్యుల సూక్తులు విశదం చేస్తున్నాయి. అర్చారూపియైన శ్రీనివాసునిలో సౌందర్య సౌలభ్యాది పలు గుణాలు ప్రకాశిస్తున్నా, **"నికరిల్ పుకఴాయ్"** అనే రీతిలో ఆ స్వామిలోని వాత్సల్యగుణం విశిష్టమైనది. ఆ వాత్సల్య గుణం దయాగుణ మూలకం.

దయ అంటే - ఇతరుల దుఃఖాన్ని చూచి సహించలేక స్వార్థనిరపేక్షంగా దానిని తొలగించాలనే గుణం. **"దయా పరవ్యసనహరా"** అని భట్టర్ ఈ గుణాన్ని నిర్వచించారు. శ్రీరంగ గద్యవ్యాఖ్యానంలో పెరియవాచ్చాన్‌పిళ్ళై ఈ గుణాన్ని **"స్వార్థనిరపేక్షమాన పరదుఃఖాసహిష్ణుత్వమ్"** అని వివరించారు. అంతేకాక దీనికి **"భృశం భవతి దుఃఖితః"** అనే శ్రీరామాయణసూక్తిని ప్రమాణంగా ఉట్టంకించారు. శ్రీరామచంద్రునివలే శ్రీవేంకటేశ్వరుడు కూడా శరణాగత రక్షణ దీక్షాదీక్షితుడు కనుక శ్రీవేంకటేశ్వరునిలో దయాగుణం విశేషంగా ప్రకాశించడంలో ఆశ్చర్యం ఏమీ లేదు.

శతాధికగ్రంథకర్తలు, అద్వితీయమేధాపాండితీ సంపన్నులు అయిన శ్రీవేదాంత దేశికులు శ్రీనివాసుని దయాగుణవైభవాన్ని అందంగా స్తుతిస్తూ, దయాశతకమనే 108 శ్లోకాలను కలిగిన ఒక కమనీయమైన స్తుతిని వెలయించారు. ఇందులో శ్రీవేంకటేశ్వరుని దయాగుణవైభవం వివిధంగా, విలక్షణంగా కీర్తింపబడింది. దయను ఒక స్త్రీమూర్తిగా రూపిస్తూ, ఆమె శ్రీభూనీలా దేవేరుల కంటే విలక్షణమైన మహిమను కలిగినదని ఈ స్తుతిలో దేశికులు కీర్తించిన వైనం చాలా

అద్భుతం. శ్రవణసుభగాలైన శబ్దవిన్యాసాలతో, సహృదయ హృదయ రంజకాలైన వివిధార్థస్ఫురణలతో విరాజిల్లే ఈ స్తుతియొక్క వైభవం వాచామగోచరం. సహృదయపండితహృదయైకవేద్యం. ఇందులోని రస్య రహస్యార్థాలు అనేకం.

దయాశతకంలోని మొదటి నూఱు శ్లోకాలు పది పది శ్లోకాల చొప్పున పది దశకాలుగా విభాగింపబడ్డాయి. ఈ విషయాన్ని ఈ స్తుతిలోని ప్రతి పది శ్లోకాలకు ఛందస్సులో కనిపించే మార్పునుబట్టి గమనించవచ్చు. ఈ పది దశకాలు పది విశేషాలైన అర్థాలను తెలుపుతున్నాయని పెద్దలు సెలవిచ్చారు. మొదటి దశకంలో శ్రీనివాసుని మోక్షప్రదత్వం, రెండవ దశకంలో సర్వజ్ఞత్వ సర్వశక్తిత్వాలు, మూడవ దశకంలో విరోధి నిరసనశీలత్వం, నాల్గవ దశకంలో ఉపాయత్వం, అయిదవ దశకంలో ఉపేయత్వం, ఆఱవ దశకంలో భగవత్ ప్రాప్తికి ప్రపత్తి గొప్ప సాధనమనే అంశం. ఏడవ దశకంలో సౌశీల్యం, ఎనిదవ దశకంలో పరత్వం, తొమ్మిదవ దశకంలో మత్స్యకూర్మ రామకృష్ణాద్యవతారాలు, పదవ దశకంలో ప్రపత్తి చేసిన వారికి ఇక్కడే మోక్షానందాన్ని భగవానుడు అనుగ్రహిస్తాడనే విషయం తెలుపబడ్డాయని పెద్దలు వివరించారు.

దయాశతకంలోని మొదటి పది దశకాలలో గల శ్లోకాలను నిశితంగా గమనించినప్పుడు, తిరువాయ్‌మొఴి ప్రబంధంలోని పది శతకాల సారార్థాలను ఈ పది దశకాలు అంతర్భవించుకొన్నవి అని తెలుస్తున్నదని అభిజ్ఞుల అభిప్రాయం. తిరువాయ్‌మొఴి ప్రబంధలోని పది శతకాల సారార్థాలనుగూర్చి శ్రీ దేశికులు ద్రవిడోపనిషత్ తాత్పర్యరత్నావళి, ద్రవిడోపనిషత్ సారం అనే గ్రంథాలలో అనుగ్రహించిన రీతినిబట్టి చూస్తే, ఈ దయాశతకంలోని పది దశకాలు క్రమాను సారంగా వాటిని సూచిస్తున్నవని, ఈ అంశం దయాశతకంలోని ఆయా దశకాలలోని కొన్ని శ్లోకాలను బట్టి గమనించవచ్చునని కూడా ఉ॥వే॥ శ్రీమాన్ వంగీపురం నవనీతం శ్రీరామ దేశికాచార్య స్వామివారు అంటూ ఆ వివరాన్ని ఈవిధంగా తెలియజేశారు. దయాశతకంలోని మొదటి దశకంలో భగవానుడు ఆశ్రయణీయుడు అనే విషయం తెలుపబడింది. ఈ అంశం తొమ్మిదవ శ్లోకంలో సూచింపబడింది. రెండవ దశకంలో భగవానుడు అనుభవంలో చాలా మధురమైన వాడు అనే అంశం సూచింపబడింది. దీనిని 19 శ్లోకం సూచిస్తున్నది. మూడవ దశకం భగవానుని దివ్యమంగళ విగ్రహ యుక్తత్వాన్ని తెలుపుతున్నది. దీనిని 22వ శ్లోకం సూచిస్తున్నది. నాల్గవ దశకంలో అన్ని భోగ్య వస్తువులకంటే భగవానుడే గొప్ప భోగ్యమైనవాడు అనే అంశం తెలుపబడగా దీనిని దయాశతకంలోని 39వ, 40వ శ్లోకాలు సూచిస్తున్నవి. 5వ దశకం భగవానుడు పురుషార్థాన్ని, ఉపాయాన్ని అనుగ్రహించేవాడని తెలుపుతున్నది.

ఈ విషయం 49వ శ్లోకంద్వారా సూచింప బడింది. 6వ దశకంలో భగవానుడు ప్రపత్తి సులభుడు అని తెలుపబడగా, ఈ అంశం 51వ, 59వ, 60వ శ్లోకాలద్వారా సూచింపబడింది. అనిష్టాన్ని పోగొట్టే స్వభావాన్ని భగవానుడు కలవాడనే 7వ దశకంలో ప్రతిపాదింపబడగా, ఈ అంశం 61వ శ్లోకంద్వారా సూచింపబడింది. 8వ దశకంలో భగవానుని భక్తపరతంత్రత తెలుపబడగా, ఈ అంశం 75వ శ్లోకం ద్వారా వ్యక్తమౌతున్నది. 9వ దశకంలో భగవానుడు సహజసౌహార్దాన్ని కలవాడని తెలుపబడగా, ఈ విషయం 85వ శ్లోకంలో సూచింపబడింది. చివరిగా 10వ దశకంలో భగవానుడు అర్చిరాదిగతిలో పయనించేవారికి సహాయకుడనే విషయం తెలుప బడగా, ఈ అంశం 93వ, 95వ శ్లోకాలలో సూచింపబడింది. ఈవిధంగా తిరువాయ్ మొళ్ళి ప్రబంధంలోని పది శతకాలలో ప్రతిపాదింపబడ్డ అంశాలే దయాశతకంలోని మొదటి పది దశకాలలో తెలుప బడ్డాయని, ఇవి ఆయా దశకాలలోని కొన్ని శ్లోకాల ద్వారా సూచింపబడ్డాయని శ్రీమాన్ శ్రీరామదేశికాచార్య స్వామివారి వివరణం.

ఇంతటి ప్రౌఢసుందరమైన ఈ శతకానికి ఎన్నో చక్కని వ్యాఖ్యలు, అనువాదాలు ఆంధ్ర భాషలో ఇతః పూర్వమే రచింపబడ్డాయి. సామాన్య పాఠకుని దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం తాత్పర్యంతో కూడిన ఈ దయాశతక గ్రంథ ప్రచురణ చేయబడుతున్నది. ఆస్తికులైన సహృదయ పాఠకులు దీనిని ఆదరిస్తారని నమ్ముతున్నాను.

ఇట్లు, విన్నవించు

భక్త విధేయుడు

తిరుపతి

20-11-2011

ఈ.ఏ. శింగరాచార్యులు

శ్రీవేదాంతదేశిక ప్రణీతమైన

దయాశతకం

(తాత్పర్యంతో)

1. **ప్రపద్యే తం గిరిం ప్రాయః శ్రీనివాసానుకంపయా।**
ఇక్షుసారస్రవంత్యేవ యన్మూర్త్యా శర్కరాయితమ్ ॥

శ్రీనివాసుని కృప తీయని చెఱకురసం నదివలె ఉన్నది. బహుశః అది వేంకటాద్రిరూపంలో కలకండగా మాఱినది (ఘనీభవించింది). అటువంటి ఘనీభవించిన శ్రీనివాసుని కృపాప్రవాహరూపమైన వేంకటాద్రిని నేను శరణుపొందుతున్నాను.

2. **విగాహే తీర్థబహుళాం శీతలాం గురుసంతతిమ్ ।**
శ్రీనివాసదయాంభోధిపరీవాహ పరంపరామ్ ॥

పలువురు ఆచార్యులతో నిండినది (పలు తీర్థాలతో కూడినది), చల్లని మనస్సును కల్గినది (చల్లదనాన్ని కల్గినది), శ్రీనివాసుని దయాసముద్రంలోనుండి వెలువడిన ప్రవాహాల పరంపరవంటిది అయిన ఆచార్యపరంపరను విశేషంగా అనుభవిస్తున్నాను. (అవగాహిస్తున్నాను)- (అభినివేశాన్ని పొందుతున్నాను - ఆదరాన్ని కల్గి ఉన్నాను)

3. **కృతినః కమలావాసకారుణ్యైకాంతినో భజే ।**
ధత్తే యత్సూక్తిరూపేణ త్రివేదీ సర్వయోగ్యతామ్ ॥

శ్రీనివాసుని కరుణనే ఆశ్రయంగా కలవారై, (అందువల్లనే) భాగ్యశాలురైన దివ్యసూరులను భజిస్తున్నాను. మూడు వేదాలు ఈ దివ్యసూరుల దివ్యప్రబంధాల రూపంలో అందఱిచే అభ్యసింపబడే యోగ్యతను పొందుతున్నవి.

4. **పరాశరముఖాన్ వందే భగీరథనయే స్థితాన్ ।**
కమలాకాంతకారుణ్య గంగాప్లావితమద్విధాన్ ॥

శ్రీనివాసుని కరుణ అనే గంగానదితో నావంటివారిని ప్లావితులనుగా (మునిగినవారినిగా) చేసేవారు, (అందువల్ల) భగీరథుని న్యాయంలో ఉన్నవారైన (అందఱిని ఉజ్జీవింపజేసేవారైన) పరాశర - వ్యాస - వాల్మీక్యాదులను నమస్కరిస్తున్నాను.

5. అశేషవిఘ్నశమన మనీకేశ్వర మాశ్రయే ।
శ్రీమతః కరుణాంభోధౌ శిక్షాస్రోత ఇవోత్థితమ్ ॥

శ్రీనివాసుని కరుణ అనే సరస్సులో ఉద్భవించిన శిక్షా ప్రవాహంవంటివాడు, అన్ని విఘ్నాలను ఉపశమింపజేసేవాడు, సేనాధిపతి అయిన విష్వక్సేనుని ఆశ్రయిస్తున్నాను.

6. సమస్తజననీం వందే చైతన్యస్తన్యదాయినీమ్ ।
శ్రేయసీం శ్రీనివాసస్య కరుణామివ రూపిణీమ్ ॥

జ్ఞానమనే స్తన్యాన్ని ఇచ్చేది, సకలశ్రేయస్సును అనుగ్రహించేది, రూపాన్ని పొందిన శ్రీనివాసుని కరుణవంటిది అయిన సకలజగజ్జననిని (లక్ష్మీదేవిని) నేను నమస్కరిస్తున్నాను.

7. వందే వృషగిరీశస్య మహిషీం విశ్వధారిణీమ్ ।
తత్కృపాప్రతిఘాతానాం క్షమయా వారణం యయా ॥

ఆ శ్రీనివాసుని కృపకు కలిగే ఆటంకాలను తీర్చడం అనే విషయం (క్షమాగుణ రూపిణి అయిన) ఏభూదేవిచేత సంభవిస్తున్నదో, అటువంటి, లోకాలను అన్నిటిని ధరించే శ్రీనివాసునియొక్క మహిషి అయిన భూదేవిని నమస్కరిస్తున్నాను (త్రికరణాత్మకంగా సేవిస్తున్నాను)

8. నిశామయతు మాం నీళా యద్భోగపటలైర్ధ్రువమ్ ।
భావితం శ్రీనివాసస్య భక్తదోషేష్వదర్శనమ్ ॥

ఏ నీళాదేవివల్ల కల్గిన భోగపారవశ్యమనే కంటిపొరలవల్ల భక్తుల దోషాలలో శ్రీనివాసుని దృష్టి పడకపోవడం నిశ్చయంగా సంభవిస్తున్నదో, ఆ నీళాదేవి నన్ను కటాక్షించుగాక!

9. కమప్యనవధిం వందే కరుణావరుణాలయమ్ ।
వృషశైలతటస్థానాం స్వయంవ్యక్తిముపాగతమ్ ॥

వాఙ్మనస్సులకు అందనిది, అంతు లేనిది, వేంకటాచలంయొక్క కొండ చరియలలో ఉండేవారికోసం స్వయం సాక్షాత్కారాన్ని పొందినది. విలక్షణమైనది అయిన కరుణాసముద్రాన్ని (కరుణాసముద్రునివంటి శ్రీనివాసుని) నమస్కరిస్తున్నాను.

10. అకించననిధిం సూతిమపవర్గత్రివర్గయోః ।
అంజనాద్రీశ్వరదయా మభిష్టౌమి నిరంజనామ్ ॥

అకించనులకు (ఏమీ లేనివారికి) గొప్ప నిధివంటిది. మోక్షాన్ని, మిగిలిన ధర్మ-అర్థ-కామాలనే త్రివర్గాన్ని అనుగ్రహించేది, ఏ దోషం లేనిది అయిన శ్రీవేంకటేశ్వరుని కృపను స్తుతిస్తున్నాను.

11. అనుచరశక్త్యాదిగుణా మగ్రేసరబోధవిరచితాలోకామ్ ।
స్వాధీనవృషగిరీశాం స్వయంప్రభూతాం ప్రమాణయామి దయామ్ ॥

తనను అనుసరించి వచ్చే శక్త్యాది గుణాలను కల్గినది, ముందు వెళ్ళే జ్ఞానమనే గుణంచేత చేయబడిన దర్శనాన్ని కల్గినది (దారి చూపించబడినది), తన వశంలో వేంకటాద్రివిభుని కల్గినది, స్వయంగా గొప్పది (పుష్కలమైనది) అయిన దయాదేవిని ఆదరంగా ప్రమాణీకరిస్తున్నాను. (స్తుతించడంద్వారా ప్రామాణికంగా నిరూపిస్తున్నాను.)

12. అపి నిఖిలలోకసుచరిత ముష్టింధయదురిత మూర్ఛనాజుష్టమ్ ।
సంజీవయతు దయే ! మా మంజనగిరినాథరంజనీ భవతీ ॥

దయాదేవీ ! అంజనాద్రి విభుని ఆనందింపజేస్తున్న నీవు సమస్తజనులయొక్క పుణ్యాలను అన్నిటిని ఒక్క పిడికిలిలో పానం జేయగల్గిన పాపాలచేత మోహాన్ని పొందిన నన్ను ఉజ్జీవింపజేయాలి.

13. భగవతి దయే ! భవత్యా వృషగిరినాథే సమాప్లుతే తుంగే ।
అప్రతిఘమజ్జనానాం హస్తాలంబో మదాగసాం మృగ్యః ॥

భగవతీ ! (మహానుభావురాలవైన) దయాదేవీ ! ఉన్నతుడైన వేంకటేశుడు నీచేత ముంచెత్తబడినపుడు, మునిగిపోవడంలో ఏఆటంకం లేని నా పాపాలకు (అవి మునిగి పోకుండా ఉండేటట్లుగా చేసే) హస్తావలంబం (చేయూత) మృగ్యం. (నీలో నా పాపాలన్నీ తప్పక మునిగిపోతాయి).

14. కృపణజనకల్పలతికాం కృతాపరాధస్య నిష్క్రియామాద్యామ్ ।
వృషగిరినాథదయే! త్వాం విదంతి సంసారతారిణీం విబుధాః ॥

శ్రీవేంకటేశ్వరుని దయాదేవీ ! అకించనులైన (ఏ ఆధారం లేని) చేతనులకు కల్పలతవై, పాపాలు చేసినవారికి మొట్టమొదటి ప్రాయశ్చిత్తమై ఉండే నిన్ను పండితులు సంసారనుండి తరింపజేసేదానివిగా తెలిసికొంటున్నారు.

15. వృషగిరి గృహమేధిగుణాః బోధబలైశ్వర్యవీర్యశక్తిముఖాః ।
దోషాభవేయురేతే యది నామ దయే ! త్వయా వినా భూతాః ॥

దయాదేవీ ! జ్ఞానం, బలం, ఐశ్వర్యం, వీర్యం, శక్తి మొదలైన వృషగిరినాథుని గుణాలు నిన్ను విడిచి ఉన్నవి అయితే, ఇవి అన్నీ దోషాలే కాగలవు.

16. ఆసృష్టిసంతతానా మపరాధానాం నిరోధినీం జగతః ।
పద్మాసహాయకరుణే ! ప్రతిసంచరకేళి మాచరసి ॥

లక్ష్మీనాథుడైన వేంకటేశ్వరుని దయాదేవీ! సృష్టికాలం మొదలు నిరంతరం విస్తరింప జేయబడుతున్న లోకంయొక్క (లోకంలోని జనుల) పాపాలను నిరోధించే ప్రళయమనే కేళిని నీవు చేస్తున్నావు.

17. అచిదవిశిష్టాన్ ప్రళయే జంతూనవలోక్య జాతనిర్వేదా ।
కరణకళేబరయోగం వితరసి వృషశైలనాథకరుణే! త్వమ్ ॥

శ్రీవేంకటేశ్వరుని దయాదేవీ! నీవు, ప్రళయకాలంలో అచిత్ పదార్థాలవలె పడి ఉండే జీవులను చూచి, మనస్సులో బాధపడినదానవై, వానికి ఇంద్రియాలతో, శరీరంతో సంబంధాన్ని అనుగ్రహిస్తున్నావు. (ఇంద్రియాలతో, శరీరంతో కూడేటట్లు వానిని చేస్తున్నావు).

18. అనుగుణదశార్పితేన శ్రీధరకరుణే ! సమాహితస్నేహా ।
శమయసి తమః ప్రజానాం శాస్త్రమయేన స్థిరప్రదీపేన ॥

శ్రీనివాసుని దయాదేవీ! ప్రేమను మిక్కిలిగా కల్గినది (నూనెతో నింపబడినది), సత్త్వగుణాన్ని కల్గినది, తగిన దశలో ఇవ్వబడినది (తగిన వత్తిలో వెలిగింపబడినది), శాస్త్రరూపమైనది అయిన శాశ్వతదీపంతో జనుల అజ్ఞానమనే చీకటిని నీవు పోగొడుతున్నావు.

19. రూఢా వృషాచలపతేః పాదే ముఖకాంతిపత్రలచ్ఛాయా ।
కరుణే ! సుఖయసి వినతాన్ కటాక్షవిక్షేపైః కరాపచేయఫలైః ॥

దయాదేవీ! వేంకటేశ్వరుని శ్రీచరణంలో మొలచినదానవు, అతని ముఖకాంతి చేత దట్టంగా ఉండే ఆకుల శోభను కల్గినదానవు అయిన నీవు, శరణా గతులకు వారి చేతులతో కోసికొనడానికి తగినట్లుండే ఫలాలను కల కటాక్షాలనే కొమ్మలతో ఆనందింపజేస్తున్నావు. (దయాదేవి ఒక కల్పలత. ఇది శ్రీనివాసుని పాదభూమిలో

మొలిచింది. ఆ స్వామి తిరుముఖకాంతితో పచ్చని ఆకులను దట్టంగా కల్గి ఉన్నట్లుగా శోభిల్లుతున్నది. స్వయంగా చేతులతో కోసికోగలిగే రీతిలో ఫలాల సమృద్ధివల్ల వంగి ఉండే కొమ్మలను కల్గినదై తనను ఆశ్రయించినవారిని ఆనందింపజేస్తున్నది.)

20. నయనే వృషాచలేందోః తారామైత్రీం దధానయా కరుణే !
దృష్టస్త్వయైవ జనిమానపవర్గ మకృష్టపచ్య మనుభవతి ॥

దయాదేవీ! వేంకటాద్రిలో చంద్రునివలె ప్రకాశించే శ్రీనివాసునియొక్క నేత్రంలో కంటిపాలతో స్నేహాన్ని (తారకల మైత్రిని) కల్గిన నీచేతనే కటాక్షింపబడ్డవాడై, జనిధర్మాన్ని కల (జన్మించేస్వభావాన్ని కల) జీవుడు మోక్షాన్ని దున్నకుండానే (ప్రయాసపడకుండానే) పొందే ఫలంగా అనుభవిస్తున్నాడు.

21. సమయోపనతైస్తవప్రవాహై రనుకంపే ! కృతసంప్లవా ధరిత్రీ ।
శరణాగత సస్యమాలినీయం వృషశైలేశకృషీవలం ధినోతి ॥

దయాదేవీ! తగిన సమయంలో ప్రవహించే నీ ప్రవాహాలతో చక్కగా తడుప బడినది, శరణాగతిని చేసినవారనే సస్యాల వరుసను కల్గినది అయిన ఈ ధరిత్రి శ్రీవేంకటేశ్వరుడనే కృషీవలుని (రైతును) ఆనందింపజేస్తున్నవి.

22. కలశోదధిసంపదో భవత్యాః కరుణే! సన్మతిమంథసంస్కృతాయాః ।
అమృతాంశమవైమి దివ్యదేహం మృతసంజీవన మంజనాచలేందోః॥

ఓ దయాదేవీ! మరణించినవారిని సైతం తిరిగి జీవింపజేసేదైన శ్రీ వేంకటా చలంలో చంద్రునివంటి శ్రీనివాసుని దివ్యతిరుమేనిని, సన్మతి (చక్కని బుద్ధి) అనే కవ్వంతో చిలుకబడినదానవు, పాలసముద్రంయొక్క సంపదను (గొప్పతనాన్ని) కల్గినదానవు అయిన నీయొక్క అమృతాంశంగా తెలిసికొంటున్నాను.

23. జలధేరివ శీతతా దయే! త్వం వృషశైలాధిపతేః స్వభావభూతా ।
ప్రళయారభటీనటీం తదీక్షాం ప్రసభం గ్రాహయసి ప్రసత్తిలాస్యమ్ ॥

దయాదేవీ ! సముద్రానికి చల్లదనంవలె, వృషగిరినాథునకు సహజగుణమై ఉండే నీవు ప్రళయమనే భయంకరలీలను ఆడే అతని (భగవానుని) సంకల్పాన్ని బలవంతంగా (మార్చి), అనుగ్రహమనే శాంతమైన లాస్యాన్ని (నాట్యాన్ని) గ్రహించే టట్లుచేస్తున్నావు.

24. ప్రణతప్రతికూలమూలఘాతీ ప్రతిఘః కోఽపి వృషాచలేశ్వరస్య ।
కలమే యవసాపచాయనీత్యా కరుణే ! కింకరతాం తవోపయాతి ॥

దయాదేవీ ! విలక్షణమైన వృషగిరినాథుని కోపం తనకు నమస్కరించేవారి (భక్తుల) శత్రువులను సమూలంగా నశింపజేస్తున్నది, పైరులోని కలుపును తీసే రీతిలో నీకు కింకరత్వాన్ని (దాస్యాన్ని) చేసే స్థితిని పొందుతున్నది.

25. అబహిష్కృత నిగ్రహాన్ విదంతః కమలాకాంతగుణాన్ స్వతంత్రతాదీన్ ।
అవికల్పమనుగ్రహం దుహానాం భవతీమేవ దయే ! భజంతి సంతః ॥

దయాదేవీ! స్వాతంత్ర్యం మొదలైన శ్రీనివాసుని గుణాలను నిగ్రహాన్ని వీడనివిగా తెలిసికొన్న సత్పురుషులు వేఱొక ఆశ్రయం లేనివారై అనుగ్రహాన్ని మాత్రమే స్రవించే నిన్నే ఆశ్రయిస్తున్నారు. (శ్రీనివాసుడు నిగ్రహానుగ్రహసమర్థుడు; నీవు అనుగ్రహాన్ని తప్ప నిగ్రహాన్ని తెలియనిదానవు. కనుక నిన్నే సత్పురుషులు ముందుగా ఆశ్రయించి నీ సహాయంతో భగవానుని శరణాగతి చేస్తున్నారు.)

26. కమలానిలయస్త్వయా దయాళుః కరుణే! నిష్కరుణా నిరూపణే త్వమ్।
అత ఏవ హి తావకాశ్రితానాం దురితానాం భవతి త్వదేవ భీతిః ॥

దయాదేవీ! శ్రీనివాసుడు నీవల్ల దయాళువు (దయను కలవాడు) అవుతున్నాడు. విచారించి చూస్తే నీవు కరుణ లేనిదానివి. అందువల్లనేకదా నిన్ను ఆశ్రయించిన పాపాలకు నీవల్లనే భయం కల్గుతున్నది. (నిన్ను ఆశ్రయించినవారి పాపాలను నీవు పోగొడుతున్నావు. నీవల్ల శ్రీనివాసుడు దయ కలవాడవుతున్నాడు- అని ఇచటి వాక్చమత్కారం.)

27. అతిలంఘితశాసనేష్వభీక్ష్ణం వృషశైలాధిపతిర్విజృంభితోష్మా ।
పునరేవ దయే ! క్షమానిదానైః భవతీ మాద్రియతే భవత్యధీనైః ॥

దయాదేవీ ! మాటిమాటికి శాస్త్రాలను ఉల్లంఘించి నడచుకొనేవారిపట్ల చాలా ఎక్కువగా వృద్ధి చెందిన వేడిమిని (కోపాన్ని) కలవాడైన వృషగిరీశుడు తిరిగి నీల్ల కల్గిన క్షమకారణంగా నిన్నే ఆదరిస్తున్నాడు.

28. కరుణే ! దురితేషు మామకేషు ప్రతికారాంతరదుర్జయేషు ఖిన్నః ।
కవచాయితయా త్వయైవ శార్ఙ్గీ విజయస్థాన ముపాశ్రితో వృషాద్రిమ్॥

దయాదేవీ! నాకు చెందిన (నేను చేసిన) పాపాలు వేఱు పరిహారాలతో జయించడానికి (పోగొట్టడానికి) వీలుకానపుడు చాలా బాధపడిన, శార్ఙ్గమనే ధనుస్సును ధరించే శ్రీనివాసుడు తనకు కవచంవలె ఉండే నిన్ను ధరించినవాడై విజయస్థానమైన వేంకటాచలాన్ని ఆశ్రయించాడు.

29. మయి తిష్ఠతి దుష్కృతాం ప్రధానే మితదోషానితరాన్ విచిన్వతీ త్వమ్ ।
అపరాధగణై రపూర్ణకుక్షిః కమలాకాంతదయే! కథం భవిత్రీ ॥

శ్రీనివాసుని దయాదేవీ! పాపులలో అగ్రేసరుడనైన నేను ఉండగా, చాలా తక్కువ దోషాలను కల ఇతరులను అన్వేషిస్తూ వారి పాపసమూహాలతో కడుపు నిండనిదానివై నీవు ఏవిధంగా జీవిస్తావో! (లోకంలో అందఱికంటే ఎక్కు పాపాలను చేసినవాడను నేనే. నన్ను అనుగ్రహిస్తే నీ కడుపు నిండుతుంది - అని చమత్కారం.)

30. అహమస్మ్యపరాధచక్రవర్తీ కరుణే! త్వం చ గుణేషు సార్వభౌమీ ।
విదుషీస్థితి మీదృశీం స్వయం మాం వృషశైలేశ్వరపాదసాత్కురు త్వమ్ ॥

దయాదేవీ! నేను పాపాలకు చక్రవర్తిని. (గొప్పవాడను). నీవు గుణాలలో సార్వభౌమివి (గొప్పదానివి). ఇటువంటి స్థితిని తెలిసిన నీవు నన్ను స్వయంగా శ్రీవేంకటేశ్వరుని పాదాల చెంతకు చేరేటట్లు చేయాలి.

31. అశిథిలకరణేఽస్మిన్నక్షత శ్వాసవృత్తౌ
వపుషి గమనయోగ్యే వాసమాసాదయేయమ్ ।
వృషగిరికటకేషు వ్యంజయత్సు ప్రతీతైః
మధుమథనదయే! త్వాం వారిధారావిశేషైః ॥

మధువనే అసురుని సంహరించిన శ్రీనివాసునియొక్క దయాదేవీ! ఈ శరీరం శిథిలంకాని ఇంద్రియాలను కల్గినదై, శ్వాస క్షీణించనిదై, నడవడానికి తగిన యోగ్యతను కల్గినదై ఉన్నపుడు మిక్కిలి ప్రసిద్ధిని పొందిన గొప్ప నీటిధారలతో నిన్ను స్మరింపజేసే వేంకటాచలం చఱియలలో (పాదసమీపప్రాంతాలలో) వాసాన్ని పొందుతాను. (నివసిస్తాను).

32. అవిదితనిజయోగక్షేమ మాత్మానభిజ్ఞం
గుణలవరహితం మాం గోప్తుకామా దయే ! త్వామ్ ।
పరవతి చతురైస్తే విభ్రమైః శ్రీనివాసే
బహుమతి మనపాయాం విందసి శ్రీధరణ్యోః ॥

దయాదేవీ! నా యోగక్షేమాలను తెలియనివాడనై, నన్ను (నా స్వరూపాన్ని) తెలియనివాడనై, సద్గుణాన్ని కొంచెంకూడా లేనివాడనైన నన్ను రక్షించగోరిన నీవు చతురాలైన నీ విభ్రమాలతో శ్రీనివాసుని నీకు పరతంత్రుడైనపుడు, లక్ష్మీదేవి, భూదేవి అనే వీరియొక్క శాశ్వతమైన బహుమతిని (గొప్ప ఆదరాన్ని) పొందుతున్నావు.

(శ్రీదేవి భూదేవులు ఇరువురు రక్షించలేని నన్ను నీవు శ్రీనివాసుని నీకు వశునిగా చేసికొని రక్షించినందువల్ల వారి ఇద్దఱి ఆదరాన్ని పొందుతున్నావు).

33. ఫలవితరణదక్షం పక్షపాతానభిజ్ఞం
ప్రగుణమనువిధేయం ప్రాప్య పద్మాసహాయమ్ ।
మహతి గుణసమాజే మానపూర్వం దయే ! త్వం
ప్రతివదసి యథార్హం పాప్మనాం మామకానామ్ ॥

దయాదేవీ! ఫలాన్ని ఇవ్వడంలో సమర్థుడు, పక్షపాతాన్ని తెలియనివాడు, (ఋజుత్వమనే) గొప్ప గుణాన్ని కలవాడు, దరి చేరడానికి వీలయినవాడు (లేక, గొప్పదైన అష్టాక్షరీమంత్రానికి వశమయేవాడు), లక్ష్మీసహచరుడైన శ్రీనివాసుని శరణు పొంది, గొప్ప గుణాల (ను కల పెద్దల) సమూహంలో (సమాజంలో) నీవు నాపట్ల గౌరవంతో (ప్రమాణపురస్సంగా) నా పాపాలకు తగిన రీతిలో ప్రతివాదాన్ని చేస్తు న్నావు (నావైపు వాదించి నన్ను గెలిపించి, తీర్పు నా పక్షంలో వచ్చేటట్లు చేస్తున్నావు)

34. అనుభవితు మఘౌఘం నాలమాగామికాలః
ప్రశమయితు మశేషం నిష్క్రియాభిః న శక్యమ్ ।
స్వయమితి హి దయే! త్వం స్వీకృతశ్రీనివాసా
శిథిలితభవభీతిః శ్రేయసే జాయసే నః ॥

దయాదేవీ! జీవుడు తన పాపసమూహాన్ని ఏమీ మిగలకుండా అతడు అనుభవించడానికి రాబోయే కాలం అంతా అయినా చాలదు. ప్రాయశ్చిత్తాలతో ఆ పాపాలను పోగొట్టుకోవడం సాధ్యం కాదు- అని భావించి, స్వయంగా శ్రీనివాసుని వశపఱచుకొని నీవు సంసారభయాన్ని శిథిలం చేసినదానివై మా శ్రేయస్సుకోసం ఆవిర్భవించావు.

35. అవతరణవిశేషై రాత్మలీలాపదేశై
రవమతి మనుకంపే ! మందచిత్తేషు విందన్ ।
వృషభశిఖరినాథ స్త్వన్నిదేశేన నూనం
భజతి శరణభాజాం భావినో జన్మభేదాన్ ॥

దయాదేవీ! శ్రీవేంకటేశ్వరుడు నీ ఆజ్ఞతో తన లీలలు అనే పేరును కల అవతారాలతో మందమతుల అవమానాన్ని పొందేవాడైనా తనను శరణు పొందిన వారికోసం ముందు రాబోయే పలు జన్మలను పొందుతున్నాడు. (ఇది) నిశ్చయం.

36. పరహిత మనుకంపే ! భావయంత్యాం భవత్యాం
స్థిర మనుపధిహార్దం శ్రీనివాసో దధానః ।
లలితరుచిషు లక్ష్మీభూమినీళాసు నూనం
ప్రథయతి బహుమానం త్వత్ప్రతిచ్ఛందబుద్ధ్యా ॥

దయాదేవీ! ఇతరుల మంచినే ఆలోచించే నీపట్ల స్థిరమైన, నిరుపాధికమైన ప్రేమను కల శ్రీనివాసుడు అందమైన కాంతిని కల లక్ష్మీదేవి, భూదేవి - నీళాదేవి- అనే వీరి విషయంలో (వారు) నీ ప్రతిబింబాలనే భావనతో బహుమానాన్ని (గౌరవాన్ని) చూపుతున్నారు. (ఇది) నిశ్చయం.

37. వృషగిరిసవిధేషు వ్యాజతో వాసభాజాం
దురితకలుషితానాం దూయమానా దయే ! త్వమ్ ।
కరణవిలయకాలే కాందిశీకస్మృతీనాం
స్మరయసి బహులీలం మాధవం సావధానా ॥

దయాదేవీ ! వేంకటాద్రిసమీపాలలో ఏదో కారణంచేత నివసించేవారై, పాపకార్యాలచే మలినులైనవారి విషయంలో బాధపడుతున్న నీవు వారి ఇంద్రియాలు విలయాన్ని పొందినపుడు, అన్ని స్మరణలు కాందిశీకులు (విడిచి వెళ్ళిపోయినవి) అయినపుడు (స్మృతులను అన్నిటిని కోల్పోయినపుడు) పలు విధాలైన లీలలను కల మాధవుని సావధానవై (అభిప్రాయంతో కూడినదానవై) స్మరింపజేస్తున్నావు. ప్రపన్నుల అంతిమకాలంలో వారు భగవానుని స్మరించేటట్లు చేసి, ముక్తిని పొందిస్తున్నావు. దీనికి కారణం- వారు తిరుమలగిరుల ప్రాంతాలలో నివసించడమే)

38. దిశి దిశి గతివిద్భిః దేశికైః నీయమానా
స్థిరతరమనుకంపే ! స్వానలగ్నా గుణైస్త్వమ్ ।
పరిగతవృషశైలం పార మారోపయంతీ
భవజలధిగతానాం పోతపాత్రీ భవిత్రీ ॥

దయాదేవీ ! సద్గతిని తెలిసిన (దయ ప్రసరించే రీతిని తెలిసిన) ఆచార్యులచే (నావికులచే) ఆ యా దిక్కులలో తీసికొనిపోబడే దానవు, (నడపుకొని పోబడుతున్నది) సద్గుణాలతో (దారాలతో) సంబంధం కల్గినదానవు. (చాలా బిగువుగా విడివకుండా ఉండేటట్లు కట్టబడినది) శ్రీవేంకటాద్రిని చేరిన (భగవాను డనే) తీరాన్ని చేర్చేదానివి అయిన నీవు సంసారసముద్రంలో ఉన్నవారికి తెప్పగా భావించదగినదానివి అవుతున్నావు.

39. పరిమితఫలసంగాత్ ప్రాణినః కింపచానాః
నిగమవిపణిమధ్యే నిత్యముక్తానుషక్తమ్ ।
ప్రసదన మనుకంపే ! ప్రాప్తవత్యా భవత్యా
వృషగిరిహరినీలం వ్యంజితం నిర్విశంతి ॥

దయాదేవీ! అల్పులైన మానవులు అల్పఫలాలలో గల ఆశచేత వేదాలనే అంగడివీథి మధ్యలో ప్రవేశించినవారై, అనుగ్రహాన్ని కల్గినదానవైన నీచే వ్యక్తం చేయబడినది, నిత్యసూరులతో ముక్తులలో కలసి ఉండేది అయిన వృషాద్రీశుడనే నీలమణిని పొంది అనుభవిస్తున్నారు.

40. త్వయి బహుమతిహీనః శ్రీనివాసానుకంపే!
జగతి గతిమిహాన్యాం దేవి! సంమన్యతే యః ।
స ఖలు విబుధసింధౌ సన్నికర్షే వహంత్యాం
శమయతి మృగతృష్ణావీచికాభిః పిపాసామ్ ॥

శ్రీనివాసుని దయాదేవీ! ఈ లోకంలో ఎవడు నీపట్ల బహుమానాన్ని (గొప్ప గౌరవాన్ని) లేనివాడై, అన్యదైవాన్ని గొప్పగా భావిస్తున్నాడో, అతడు దేవగంగ తన సమీపంలో ప్రవహిస్తూ ఉన్నా, ఎండమావుల కెఱటాలతో తన దాహాన్ని తీర్చుకోవాలని తలుస్తున్నాడుకదా!

41. ఆజ్ఞాం ఖ్యాతిం ధనమనుచరా నాధిరాజ్యాదికం వా
కాలే దృష్ట్వా కమలవసతే రప్యకించిత్కరాణి ।
పద్మాకాంతం ప్రణిహితవతీం పాలనేఽ నన్యసాధ్యే
సారాభిజ్ఞా జగతి కృతినః సంశ్రయంతే దయే ! త్వామ్ ॥

దయాదేవీ! లోకంలో సారమైన విషయాన్ని తెలిసిన సమర్థులు తామరపూవులో నివసించే బ్రహ్మకుకూడా ఆజ్ఞ, కీర్తి, ధనం, సేవకులు, సర్వలోకాధిపత్యం మొదలైనవి ఒకానొక సమయంలో కొంచెం ఫలాన్నికూడా ఇవ్వలేనివి- అని గమనించి, ఇతరులకు చేయడానికి సాధ్యం కాని జగత్ రక్షణకార్యంలో శ్రీనివాసుని నియమించిన నిన్ను చక్కగా ఆశ్రయిస్తున్నారు.

42. ప్రాజాపత్యప్రభృతివిభవం ప్రేక్ష్య పర్యాయదుఃఖం
జన్మాకాంక్షన్ వృషగిరివనే జగ్ముషాం తస్థుషాం వా ।
ఆశాసానాః కతిచన విభోః త్వత్పరిష్వంగధన్యైః
అంగీకారం క్షణమపి దయే ! హార్దతుంగై రపాంగైః ॥

దయాదేవీ ! కొందఱు బ్రహ్మయొక్క పదవి మొదలైన ఐశ్వర్యాలను దుఃఖాలతో సమానంగానే గమనించి, నీ సంబంధంతో ధన్యమైన (ధనాన్ని పొందిన), ప్రేమను మిక్కుటంగా కల భగవానుని కటాక్షాలతో క్షణమాత్రకాలం అయినా అంగీకారాన్ని ఆశించేవారై, వృషాద్రిలోని వనంలో జంగమప్రాణులుగానో, స్థావరప్రాణులుగానో పుట్టాలని ఆశపడ్డారు.

43. నాభీపద్మస్ఫురణసుభగా నవ్యనీలోత్పలాభా
క్రీడాశైలం కమపి కరుణే ! వృణ్వతీ వేంకటాఖ్యమ్ ।
శీతా నిత్యం ప్రసదనవతీ శ్రద్దధానాఽవగాహ్యా
దివ్యా కాచిత్ జయతి మహతీ దీర్ఘికా తావకీనా ॥

దయాదేవీ! (భగవానుని) నాభీపద్మంయొక్క ప్రకాశంచేత అందమైనది, కొత్తగా పూచిన నీలకలువకాంతివంటి కాంతిని కల్గినది, చల్లనిది, ఎల్లప్పుడు వికాసాన్ని కల్గినది, శ్రద్ధను కలవారిచే స్నానం చేయడానికి (అనుభవించడానికి) తగినది, దివ్యమైనది (గొప్పది), చాలా పెద్దది అయిన నీకు చెందిన విలక్షణమైన దిగుడు బావి (శ్రీనివాసుడనే దీర్ఘిక) వేంకటాచలమనే పేరును కల విలక్షణమైన (ఆశ్చర్య కరమైన) క్రీడాశైలాన్ని ఆశ్రయించి ప్రకాశిస్తున్నది.

44. యస్మిన్ దృష్టే తదితరసుఖైర్గమ్యతే గోష్పదత్వం
సత్యం జ్ఞానం త్రిభిరవధిభిః ముక్త మానందసింధుమ్ ।
త్వత్ స్వీకారాత్తమిహ కృతినః సూరిబృందానుభావ్యం
నిత్యాపూర్వం నిధిమివ దయే! నిర్విశంత్యంజనాద్రౌ ॥

దయాదేవీ! ఏ పరమాత్మ సాక్షాత్కరిస్తే, అతడు తప్ప మిగిలిన సుఖాలు అన్నీ గోష్పాదమాత్రాలుగా (చాలా అల్పాలుగా) భావింపబడుతున్నవో, సత్యస్వరూపుడు, జ్ఞానస్వరూపుడు, మూడు విధాలైన పరిచ్ఛేదాలను లేనివాడు, ఆనందసింధువు, నిత్యసూరివర్గంచే అనుభవింపదగినవాడు, ఎల్లప్పుడు నిత్య నూతనంగా తోచేవాడు అయిన ఆ శ్రీనివాసుని నీ అంగీకారంతో కృతార్థులైన వారు ఈ సంసారమండలంలో వేంకటాచలంలో నిధినివలె అనుభవిస్తున్నారు.

45. సారం లబ్ధ్వా కమపి మహతః శ్రీనివాసాంబురాశేః
కాలే కాలే ఘనరసవతీ కాళికేవానుకంపే! ।
వ్యక్తోన్మేషా మృగపతిగిరౌ విశ్వమాప్యాయయంతీ
శీలోపఘ్నం క్షరతి భవతీ శీతలం సద్గుణౌఘమ్ ॥

దయాదేవీ ! గొప్పదైన శ్రీనివాసుడనే సముద్రంనుండి విలక్షణసారం అయిన అమృతాన్ని పొంది, గొప్ప(నిబిడమైన) ప్రేమను కల్గినదానివై (నీటి సమృద్ధిని కల్గినదానవై), వేంకటాద్రి అనే సింహాలు సంచరించే పర్వతంలో వ్యక్తమైన ఉన్మేషాన్ని (ఆవిర్భావాన్ని) కల్గిన నీవు మేఘాల వరుసవలె లోకాన్ని చల్లబరచేదానవై, ఆ యా కాలాలలో సౌశీల్యం మొదలైన చల్లని కల్యాణగుణాల ప్రవాహాన్ని ప్రవహిస్తున్నావు. (వేంకటాద్రిపై గల ఏడు పర్వతాలలో సింహాచలంకూడా ఒకటి. కనుక శ్లోకంలో వేంకటాద్రి **"మృగపతిగిరి"** అని నిర్దేశింపబడింది. లేక, సింహాలు సంచరించే గిరి కనుక ఈ విధంగా నిర్దేశింపబడిందని చెప్పవచ్చు.)

46. **భీమే నిత్యం భవజలనిధౌ మజ్జతాం మానవానామ్**
ఆలంబార్థం వృషగిరిపతి స్త్వన్నియోగాత్ ప్రయుంక్తే।
ప్రజ్ఞాసారం ప్రకృతిమహతా మూలభాగేన జుష్టం
శాఖాభేదై స్సుభగ మనఘం శాశ్వతం శాస్త్రపాణిమ్ ॥

వేంకటేశ్వరుడు భయంకరమైన సంసారసముద్రంలో ఎల్లప్పుడు మునిగి ఉండే మానవుల ఆలంబనంకోసం (సంసారులకు చేయూతను ఇవ్వడంకోసం) జ్ఞానాన్ని సారంగా కల్గినది, ఆకారంతో గొప్పతనాన్ని పొందినది (సహజంగానే గొప్పతనాన్ని కల్గినది), మూలమైన ప్రణవంతో (బాహుమూలభాగంతో) కూడినది, పలు పలు (వేదశాఖలతో) పలు వేళ్ళతో అందమైనది, వైకల్యం లేనిది, (నిర్దుష్టమైనది), స్థిరమైనది, శాశ్వతమైనది అయిన శాస్త్రమనే హస్తాన్ని నీ ఆదేశంవల్ల అందిస్తున్నాడు.

47. **విద్వత్సేవాకతకనికషై ర్వీతపంకాశయానాం**
పద్మాకాంతః ప్రణయతి దయే! దర్పణం తే స్వశాస్త్రమ్ ।
లీలాదక్షాం త్వదనవసరే లాలయన్ విప్రలిప్సాం
మాయాశాస్త్రాణ్యపి దమయితుం త్వత్ప్రపన్నప్రతీపాన్ ॥

దయాదేవీ! శ్రీనివాసుడు విద్వజ్జనులు చేసే సేవ అనే చిల్లగింజల రాపిడులతో మనస్సులోని కళంకాలను తీరినవారికి నిన్ను దర్శింపజేసే దర్పణం వంటి పాంచరాత్రశాస్త్రాన్ని అనుగ్రహిస్తున్నాడు. నీ అవసరం లేనపుడు లీలను చేయగల్గిన వంచనలో కోరికను (విప్రలిప్స అనే దేవతను) లాలిస్తూ, నీ దాసులకు శత్రువులైన వారిని నియమించడంకోసం మోహశాస్త్రాలను (లోకాన్ని మోహింపజేసే నాస్తిక వాదాలను) కూడా ప్రవర్తింపజేస్తున్నాడు.

48. **దైవాత్ ప్రాప్తే వృషగిరితటం దేహిని త్వన్నిదానాత్**
స్వామిన్ ! పాహీత్యవశవచనే విందతి స్వాపమంత్యమ్ ।
దేవః శ్రీమాన్ దిశతి కరుణే ! దృష్టిమిచ్ఛన్ త్వదీయామ్
ఉద్ఘాతేన శ్రుతిపరిషదా ముత్తరేణాభిముఖ్యమ్ ॥

దయాదేవీ ! నిన్ను నిదానంగా కల్గిన (నీవల్ల కల్గిన) భాగ్యంచేత వృషాద్రి (వేంకటాద్రి) చరియలను చేరిన చేతనుడు "స్వామీ! రక్షించు"అని వివశులై పలికేవాడై, అంతిమ నిద్రను (మరణాన్ని) పొందేటపుడు లక్ష్మీసహితుడైన భగవానుడు నీ దృష్టిని కోరినవాడై, వేదపరిషత్తులకు (సమూహాలకు) ప్రారంభమైన ప్రణవంతో ("ఓమ్" అనే మాటతో - అంగీకారవచనంతో) ఆభిముఖ్యాన్ని అనుగ్రహిస్తున్నాడు.

49. **శ్రేయఃసూతిం సకృదపి దయే! సమ్మతాం యః సఖీం తే**
శీతోదారా మలభత జనః శ్రీనివాసస్య దృష్టిమ్ ।
దేవాదీనామయ మనృణతాం దేహవత్త్వేఽపి విందన్
బంధాన్ముక్తో బలిభిరనఘైః పూర్యతే తత్ప్రయుక్తైః ॥

దయాదేవీ! మోక్షానికి కారణమై, చల్లనిదై, ఉదారమై, నీకు ప్రియమైన సఖియై ఉండే శ్రీనివాసుని కటాక్షాన్ని ఏ చేతనుడు ఒకసారి అయినా పొందుతున్నాడో, అతడు ఈ జీవుడు శరీరంతో ఉన్నపుడే దేవతలకు తీర్చవలసిన ఋణం మొదలైన ఋణాలు తీర్చినవాడవతున్నాడు. అతడు సంసారబంధంనుండి విముక్తుడై, అర్చిరాది మార్గంలో పయనించినపుడు ఆ పలువురు దేవతలచే ఇవ్వబడిన నిర్దుష్టమైన కానుకలచే పూర్తిగా గౌరవింపబడుతున్నాడు.

50. **దివ్యాపాంగం దిశసి కరుణే! యేషు సద్దేశికాత్మా**
క్షిప్రం ప్రాప్తా వృషగిరిపతిం క్షత్రబంధ్వాదయస్తే।
విశ్వాచార్యాః విధిశివముఖాః స్వాధికారోపరుద్ధాః
మన్యే మాతా జడ ఇవ సుతే వత్సలా మాదృశే త్వమ్ ॥

దయాదేవీ ! నీవు సదాచార్యరూపాన్ని కల్గినదానవై, గొప్ప కటాక్షాన్ని ఎవరిపట్ల అనుగ్రహిస్తున్నావో, అటువంటి క్షత్రబంధువు మొదలైనవారు శీఘ్రంగా వేంకటేశ్వరుని పొందారు. లోకానికి అంతటికి ఆచార్యులైన బ్రహ్మ, శివుడు మొదలైనవారు సైతం తమ అధికారంతో బంధితులు. అందువల్ల తల్లి జడుడైన పుత్రుని విషయంలోవలె, నీవు నావంటివారి విషయంలో వాత్సల్యాన్ని కల్గినదానవు- అని భావిస్తున్నాను.

51. అతికృపణోఽపి జన్తు రధిగమ్య దయే ! భవతీమ్
ఆశిథిలధర్మసేతుపదవీం రుచిరామచిరాత్ ।
అమితమహోర్మిజాల మతిలంఘ్య భవాంబునిధిం
భవతి వృషాచలేశ పదపత్తననిత్యధనీ ॥

దయాదేవీ! అకించనుడైన చేతనుడు (జీవుడు) అందమైన, నశించని (శిథిలం కాని), ధర్మస్వరూపుడైన భగవానుని పొందించే సేతువై ఉండే నిన్ను శరణంగా పొంది, అంతు లేని పెద్ద పెద్ద అలలను కల సంసారసముద్రాన్ని శీఘ్రంగా దాటి, శ్రీనివాసుని శ్రీచరణాలు అనే నగరంలో నిత్యమైన ధనాన్ని పొందినవాడవుతున్నాడు.

52. అభిముఖ భావసంపదభిసంభవినాం భవినాం
క్వచిదుపలక్షితా క్వచిదభంగురగూఢగతిః ।
విమలరసావహా వృషగిరీశదయే! భవతీ
సపది సరస్వతీవ శమయత్యఘమప్రతిఘమ్ ॥

వృషగిరీశుని దయాదేవీ ! నీవు సరస్వతీనదివలె స్వచ్ఛమైన ప్రేమ అనే రసాన్ని (జలానికి) కల్గినదానవై, భగవానునకు అనుకూలంగా ఉండడమనే సంపదను పూర్తిగా పొందిన సంసారులకు (భగవదాభిముఖ్యమనే సంపదను పూర్తిగా కల్గిన సంసారులకు) కొన్ని చోట్ల కంటికి కన్పించేదానవై, కొన్ని చోట్ల అడ్డు లేని గూఢమైన గతిని కలదానవై, ఎవరూ తీర్చ లేని పాపాన్ని సైతం వెంటనే తీరుస్తున్నావు.

53. అపి కరుణే ! జనస్య తరుణేందువిభూషణతా
మపి కమలాసనత్వమపి ధామ వృషాద్రిపతేః ।
తరతమతావశేన తనుతే నను తే వితతిః
పరహితవర్ష్మణా పరిపచేళిమకేళిమతీ ॥

దయాదేవీ! ఇతరులకు హితంచేయడమనే రూపంతో మిక్కిలి పరిణతిని చెందిన లీలలను కల నీ విస్తృతి (వ్యాపారం) పుణ్యాల తారతమ్యానికి తగినట్లుగా చేతనునకు (జీవునకు) బాలచంద్రుని అలంకారంగా కల శివుడై కావడాన్ని, తామరలో నివసించే బ్రహ్మగా కావడాన్ని, వృషగిరిపతియొక్క స్థానమైన శ్రీవైకుంఠాన్నికూడా ఇస్తున్నది కదా!

54. ధృతభువనా దయే ! త్రివిధగత్యనుకూలతరా
వృషగిరినాథపాద పరిరంభవతీ భవతీ ।

అవిదితవైభవాఽపి సురసింధురివాతనుతే
సకృదవగాహమాన మపతాప మపాపమపి ॥

దయాదేవీ ! లోకాలను ధరించేది (జలాన్ని కల్గినది), మూడు విధాలైన ఫలాలను పొందడానికి (ప్రవాహగతిని పొందడానికి) చాలా అనుకూలమైనది, శ్రీవేంకటేశ్వరుని శ్రీచరణాలను (ధర్మం, శివుడు, సమీపంలో ఉండే పర్వం- అనే వీటియొక్క) ఆలింగనం చేసికొన్న (సంబంధాన్ని కల్గిన) నీవు, దేవగంగవలె నీ గొప్పతనాన్ని తెలియనిదానవి అయినా ఒక పర్యాయం నీలో అవగాహించినవానిని తాపం తీరినవానినిగా చేస్తున్నావు.

55. నిగమసమాశ్రితానిఖిల లోకసమృద్ధికరీ
భజదఘకూల ముద్రుజగతిః పరితప్తహితా ।
ప్రకటితహంసమత్స్యకమఠాద్యవతారశతా
విబుధసరిచ్ఛ్రియం వృషగిరీశదయే ! వహసి ॥

దయాదేవీ! (నీవు) వేదాలచే (వృక్షాలచే) కీర్తంపబడినదానవై (ఆశ్రయింపబడిన దానవై), సకలలోకానికి సమృద్ధిని కల్గించేదానవై, శరణు పొందినవారి పాపాలను అనే (నదియొక్క) తీరాలను కూలగొట్టే ప్రవాహాలను కల్గినదానవై, పరితాపం చెందేవారికి హితాన్ని కల్గించేదానవై, వ్యక్తం చేయబడిన హంసలు, చేపలు, తాబేళ్ళు మొదలైన (వాని రూపంలోని) వందలాది జన్మలను కల్గినదానవై (వందల సంఖ్యలో రేవులను- ఘట్టాలను కల్గిన) దేవగంగయొక్క గొప్పతనాన్ని కల్గి ఉన్నావు.

56. జగతి మితంపచా త్వదితరా తు దయే! తరళా
ఫలనియమోజ్ఝితా భవతి సంతపనాయ పునః ।
త్వమిహ నిరంకుశప్రశకనాదివిభూతిమతీ
వితరసి దేహినాం నిరవధిం వృషశైలనిధిమ్ ॥

దయాదేవీ! లోకంలో నీకంటే అన్యుల దయ అల్పఫలాలను ఇవ్వగల్గినది, అస్థిరమైనది, ఫలాన్ని ఇస్తుందనే నమ్మిక లేనిది, తిరిగి దుఃఖానికి కారణమైనది అవుతున్నది. నీవు అడ్డు లేని శక్తిమొదలైన ఐశ్వర్యాలను (సంపదలను) కల్గినదానవై, ఈ లోకంలోని ప్రాణులకు నిరవధికమైన, వేంకటాద్రిలో ఉండే నిధిని (నిధివంటి స్వామిని) అనుగ్రహిస్తున్నావు.

57. సకరుణలౌకికప్రభు పరిగ్రహనిగ్రహయోః
నియతి ముపాధిచక్రపరివృత్తిపరంపరయా ।
వృషభమహీధరేశకరుణే ! వితరంగయతాం
శ్రుతిమితసంపది త్వయి కథం భవితా విశయః ॥

వృషగిరీశ్వరుని దయాదేవీ! దయను కల్గినవారైన లోకంలోని ప్రభువుల అనుగ్రహం- నిగ్రహం అనే ఇవి ఆ యా కారణాల (ఉపాధుల) చక్రభ్రమణంవలె మాఱి మాఱి వస్తున్నవి అని గమనించినవారికి వేదాలచేత నిశ్చయింపబడ్డ గొప్పతనాన్ని కల నీ విషయంలో సందేహం ఏవిధంగా కల్గుతుంది ? కలుగదు. (లోకంలోని ప్రభువులు తమకు అనుకూలంగా ఉన్నవారిని అనుగ్రహించడం, ప్రతికూలురను నిగ్రహించడం అనుభవసిద్ధం. కాని, శ్రీనివాసుని దయ తనకు అనుకూలురై ఉండేవారికి విశేషమైన అనుగ్రహాన్ని, విపరీతం నడచేవారికి వారి దోషాలకు మించకుండా శాస్త్రరీతిలో తగిన దండనను ఇస్తుంది. ఈ విధంగా దండించడంకూడా వారి హితంకోసమే కదా !

58. వృషగిరికృష్ణమేఘజనితాం జనితాపహరాం
త్వదభిమతిం సువృష్టిముపజీవ్య నివృత్తతృషః ।
బహుషు జడాశయేషు బహుమానమపోహ్య దయే !
న జహతి సత్పథం జగతి చాతకవత్ కృతినః ॥

దయాదేవీ ! లోకంలో భాగ్యవంతులు చాతకపక్షులవలె పలువురు జ్ఞానహీనుల పట్ల (పలు మడుగులపట్ల) గౌరవాన్ని కల్గి ఉండకుండా, వేంకటాద్రిలో ఉండే భగవానుడనే కాలమేఘంద్వారా కల్గినది, సంసారతాపాన్ని తీర్చేది అయిన నీ అభిమానం అనే సువృష్టిని ఉపయోగించి (పొంది), దానివల్ల దాహం తీరినవారై, సత్పురుషుల పదాన్ని (ఆకాశాన్ని) విడువడం లేదు.

59. త్వదుదయతూలికాభిరమునా వృషశైలజుషా
స్థిరచరశిల్పినైవ పరికల్పితచిత్రధియః ।
యతిపతియామునప్రభృతయః ప్రథయంతి దయే !
జగతి హితం న నస్త్వయి భరన్యసనాదధికమ్ ॥

దయాదేవీ ! వేంకటాద్రిలో నివసించేవాడు, స్థావరజంగమాలను సృష్టించే శిల్పి అయిన ఈ శ్రీనివాసునిచేతనే నిన్ను జన్మింపజేసే కుంచెలతో వ్రాయబడిన

చిత్తరువుల జ్ఞానాలను కలవారైన (చిత్రాలను చూచినవారైన) శ్రీరామానుజులు, ఆళవందార్ మొదలైనవారు నీవద్ద ప్రపత్తి చేయడంకంటే (భరన్యాసాన్ని- తమ రక్షణభారాన్ని -సమర్పించడం కంటే) గొప్పదైన సహితం లోకంలో మాకు లేదు- అని వ్యక్తం చేస్తున్నారు.

60. మృదుహృదయే ! దయే ! మృదితకామహితే ! మహితే !
ధృతవిబుధే! బుధేషు వితతాత్మధురే ! మధురే ।
వృషగిరిసార్వభౌమదయితే ! మయి తే మహతీం
భవుకనిధే ! నిధేహి భవమూలహరాం లహరీమ్ ॥

సుకుమారమైన హృదయాన్ని కల్గినదానా ! దేవతలను కాపాడేదానా ! ఆశను జయించినవారికి హితాన్ని కల్గించేదానా ! పండితుల వద్ద భారాన్ని సమర్పించిన దానా! (చేతనరక్షణరూపమైన తన భారాన్ని విజ్ఞులైనవారికి సమర్పించినదానా !) వేంకటేశ్వరునకు ప్రియురాలా ! మంగళాలకు ఆకరమైనదానా ! మధురమైనదానా ! పూజింపదగినదానా ! ఓ దయాదేవీ ! సంసారాన్ని సమూలంగా నశింపజేసే గొప్పదైన నీ ప్రవాహాన్ని నాపై ప్రవహింపజేయాలి.

61. అకూపారైరేకోదకసమయ వైతండికజవైః
అనిర్వాప్యాం క్షిప్రం క్షపయతు మవిద్యాఖ్యబడబామ్ ।
కృపే ! త్వం తత్తాదృక్ప్రథిమ వృషపృథ్వీధరపతి-
స్వరూపద్వైగుణ్యాద్విగుణ నిజబిందుః ప్ర(భవ)వహసి ॥

దయాదేవీ! అటువంటిదే అనదగిన రీతిలో (అనిర్వచనీయమైన రీతిలో) గొప్పదైన వృషాద్రీశుడైన శ్రీనివాసుని స్వరూపంకంటె రెండింతలకు రెండితలుగా (రెండు రెట్లకు రెండు రెట్లుగా) నిజస్థితిని కల్గిన నీవు అంతటా ఒకే జలంగా ఉండే (అంతటా జలమయంగా ఉండే) ప్రళయకాలంలో వితండవాదం చేసేవారి వేగాల కంటే వేగాలను కల సముద్రాలచే ఆర్పడానికి సాధ్యం కాని కర్మమనే బడబాగ్నిని వేగంగా ఆర్పడంలో సమర్థురాలవై ఉన్నావు.

62. వివిత్సావేతాళీ విగమపరిశుద్ధేఽపి హృదయే
పటుప్రత్యాహారప్రభృతి పుటపాకప్రచకితాః ।
నమంత స్త్వాం నారాయణశిఖరికూటస్థకరుణే !
నిరుద్ధత్వద్ద్రోహా నృపతిసుతనీతం న జహతి ॥

నారాయణాద్రి శిఖరంపై ఉండే వేంకటేశుని దయాదేవీ ! ఆశ అనే పిశాచి పీడినందువల్ల హృదయం పరిశుద్ధం అయినా, శక్తివంతాలైన ఇంద్రియాలను అణచడం అనే ప్రత్యాహారం మొదలైన పుటాన్ని పెట్టే కార్యానికి (పనికి) చాలా భయపడినవారై, నిన్ను శరణు పొందినవారై, నీకు ద్రోహం చేయనివారై (కొందఱు మహాత్ములు) రాజకుమారన్యాయాన్ని వీడడం లేదు. (రాజ్యాభిషేకాన్ని పొందే రాజకుమారుడు తప్పు చేసినా అతనికి దండన తప్పదు. కాని, ఆ దండన అతని అర్హతకు తగినట్లు స్వల్పంగా ఉంటుంది. అదే రీతిలో, ముముక్షువులైన ప్రపన్నులు రాజ్యాభిషేకాన్ని పొందబోయే రాజకుమారునివంటివారు. కనుక వారికి విధించే దండన స్వల్పంగా ఉంటుంది. ఇదే ఇక్కడి రాజకుమారన్యాయం).

63. అనన్యాధీనస్సన్ భవతి పరతంత్రః ప్రణమతాం
కృపే! సర్వద్రష్టా న గణయతి తేషా మపకృతిమ్ ।
పతి స్త్వత్వారార్థ్యం ప్రథయతి వృషక్ష్మాధరపతిః
వ్యవస్థాం వైయాత్యాదితి విఘటయంతీ విహరసి ॥

దయాదేవీ ! వృషగిరీశుడు ఇతరులకు అధీనుడు కాని స్వతంత్రుడైనా, అతనిని శరణాగతి చేసినవారికి పరతంత్రుడు అవుతున్నాడు. అన్నిటిని తెలిసిన సర్వజ్ఞుడైనా శరణాగతుల అపరాధాలను అతడు గణించడం లేదు. నీకు పతి అయినా, (నీపై అనురాగంవల్ల) నీకు దాసుడై ఉండే స్థితిని వ్యక్తం చేస్తున్నాడు. ఈ విధంగా నీవు నీ ధార్ష్ట్యంతో క్రమాన్ని వ్యత్యస్తం చేస్తూ విహరిస్తున్నావు.

64. అపాం పత్యుః శత్రూ నసహనమునేర్ధర్మనిగళం
కృపే ! కాకస్యైకం హితమితి హినస్తి స్మ నయనమ్ ।
విలీనస్వాతంత్ర్యో వృషగిరిపతిస్త్వద్విహృతిభిః
దిశత్యేవం దేవో జనితసుగతిం దండనవిధిమ్ ॥

దయాదేవీ! వేంకటాద్రివిభుడు నీ లీలలతో తన స్వాంతత్ర్యాన్ని కోల్పోయిన వాడై, సముద్రుని శత్రువులను, ఓర్పు అనే గుణం లేని పరశురాముని పుణ్యమనే సంకెలను, కాకాసురునియొక్క ఒక నేత్రాన్ని హితమని భావించి నశింపజేశాడు. ఈ విధంగా భగవానుడు దండించే క్రమాన్ని మంచి ఫలాన్ని కల్గించే రీతిలో ఆదేశిస్తున్నావు. (చేస్తున్నావు)

65. నిషాదానాం నేతా కపికులపతిః కాఽపి శబరీ
కుచేలః కుబ్జా సా వ్రజయువతయో మాల్యకృదితి ।

అమీషాం నిమ్నత్వం వృషగిరిపతేరున్నతమపి
ప్రభూతైః స్రోతోభిః ప్రసభమనుకంపే ! సమయసి ॥

దయాదేవీ ! బోయల ప్రభువైన గుహుడు, వానరకులపతి అయిన సుగ్రీవుడు, ఒక శబరి (కోయవనిత), కుచేలుడు, ఆ కుబ్జ, నందవ్రజంలోని కన్యకలు, మాలాకారుడు- అనే వీరియొక్క తక్కువదనాన్ని, వృషగిరీశుని ఔన్నత్యాన్ని చాలా ఎక్కువ అయిన నీప్రవాహాలతో బలాత్కారంగా సమంగా- ఎత్తుపల్లాలు- హెచ్చు తగ్గులు లేకుండా చేస్తున్నావు. (దయాదేవి కారణంగానే భగవానుడు ఇంతటి తక్కువవారితో ఒకడుగా కలసి మెలసి సంచరించాడు.)

66. త్వయా దృష్టస్తుష్టిం భజతి పరమేష్ఠీ నిజపదే
వహన్మూర్తీరష్టౌ విహరతి మృడానీపరిబృఢః ।
బిభర్తి స్వారాజ్యం వృషశిఖరిశృంగారికరుణే !
శునాసీరో దేవాసురసమరనాసీరసుభటః ॥

వృషాచలంపై శృంగార (రసిక) పురుషునిగా వెలిగే శ్రీనివాసుని దయాదేవీ ! నీచే కటాక్షింపబడ్డ బ్రహ్మ తన స్థానంలో తుష్టిని పొందుతున్నాడు. పార్వతీపతి ఎనిమిది రూపాలను ధరిస్తూ విహరిస్తున్నాడు. ఇంద్రుడు దేవాసురసంగ్రామ ముఖంలో గొప్ప వీరుడై స్వర్గాధిపత్యాన్ని వహిస్తున్నాడు.

67. దయే ! దుగ్ధోదన్వద్వ్యతియుత సుధాసింధునయతః
త్వదాశ్లేషాన్నిత్యం జనితమృతసంజీవనదశాః ।
స్వదంతే దాంతేభ్యః శ్రుతివదనకర్పూరగుళికాః
విషణ్వంతశ్చిత్తం వృషశిఖరివిశ్వంభరగుణాః ॥

దయాదేవీ ! పాలసముద్రంతో చక్కగా కలిసిన అమృతనదియొక్క క్రమంలో నీ సంశ్లేషంచేత మరణించినవారిని తిరిగి జీవింపజేసే స్థితిని పొందినవై, వేదాల ముఖానికి పచ్చకర్పూరపు గుళికలుగా (ఉపనిషత్తులచే కీర్తింపబడి ఆనందింపప జేస్తున్న) చిత్తాన్ని చల్లబఱచేవిగా ఉండే వేంకటాద్రిలో ప్రకాశించే జగద్రక్షకుని గుణాలు ఇంద్రియజయాన్ని పొందినవారికి ఎల్లప్పుడు రుచిస్తున్నవి.

68. జగజ్జన్మస్థేమప్రళయరచనాకేళిరసికో
విముక్త్యేకద్వారం విఘటితకవాటం ప్రణయినామ్ ।
ఇతి త్వయ్యాయత్తం ద్వితయముపధీకృత్య కరుణే !
విశుద్ధానాం వాచాం వృషశిఖరినాథః స్తుతిపదమ్ ॥

దయాదేవీ ! (స్వామి) లోకాల సృష్టి, స్థితి, లయాలను చేయడమనే లీలలో రసికుడు, భక్తి కలవారికి తలుపులు తెఱచిన మోక్షానికి అద్వితీయద్వారమై ఉండే వాడు- అనే నీ అధీనంలో ఉండే ఈ అంశాలను కారణంగా చేసికొని శ్రీవేంకటేశ్వరుడు పవిత్రాలైన వేదాలకు స్తుతింపదగినవాడవుతున్నాడు. (లోకానికి కారణమైన వాడు, మోక్షప్రదుడు- అనే ఈ రెండు పరతత్త్వలక్షణాలు దయాగుణమూలకాలు)

69. కలిక్షోభోన్మీలత్ క్షితికలుషకూలంకషజవైః
అనుచ్ఛేదైరేతై రవటతట వైషమ్యరహితైః ।
ప్రవాహైస్తే పద్మాసహజచరపరిష్కారిణి ! కృపే !
వికల్పంతేఽనల్పా వృషశిఖరిణో నిర్ఝరగణాః ॥

శ్రీనివాసుని పరిష్కరించే (అందాన్ని కల్గించే) ఓ దయాదేవీ ! కలిపురుషుని క్షోభవల్ల వృద్ధి చెందే భూమిలోని పాపాల తీరాన్ని కూలగొట్టే వేగాన్ని కల్గినవి, ఏవిధమైన నిలుపుదల లేకుండా ఉండేవి, ఎత్తు పల్లాలు (హెచ్చు తగ్గులు) అనే వ్యత్యాసాలు లేనివి అయిన నీ ఈ ప్రవాహాలతో సమంగా వేంకటాద్రిలోని గొప్ప కొండవాగుల సమూహాలు భావింపబడుతున్నాయి.

70. ఖిలం చేతోవృత్తేః కిమిదమితి విస్మేరభువనమ్
కృపే ! సింహక్ష్మాభృత్ కృతముఖచమత్కారకరణమ్ ।
భరన్యాసచ్ఛన్నప్రబలవృజిన ప్రాభృతభృతామ్
ప్రతిప్రస్థానం తే శ్రుతినగరశృంగాటకజుషః ॥

దయాదేవీ! వేదమనే నగరంలోని కూడలిని చేరిన నీకు భరన్యాసంచేత కప్పబడిన ప్రబలమైన పాపాలు అనే నివేదన ద్రవ్యాన్ని తీసికొని వచ్చేవారిని ఎదురేగి ఆహ్వానించడం అనేది నీ మనోవృత్తికి చాలా లోపం. ఇదేమి ? అని లోకాన్ని విస్మయ పఱచేది, సింహగిరి అనే ఈ కొండపై ఉండే శ్రీనివాసునకు ఆశ్చర్యాన్ని కల్గించేదై ఉన్నది. నీవు భరన్యాసం చేసినవారి పాపాలను వాత్సల్యంతో ఉపహారంగా గ్రహించి నశింపజేయడం సామాన్యులను, పండితులను అందఱిని ఆశ్చర్యపరుస్తున్నది.

71. త్రివిధచిదచిత్ సత్తాస్థేమ ప్రవృత్తినియామికా
వృషగిరివిభోరిచ్ఛా సా త్వం పరైరపరాహతా ।
కృపణభరభృత్కింకుర్వాణ ప్రభూతగుణాంతరా
వహసి కరుణే ! వైచక్షణ్యం మదీక్షణసాహసే ॥

దయాదేవీ ! మూడు విధాలైన చేతనాచేతనాల సత్తా - స్థితి - ప్రవృత్తులను నియమించేదానవు. ఇతరులచే అడ్డగింపబడనిదానవు, దీనుల భారాన్ని వహించే దానవు, కైంకర్యాన్ని చేసే గొప్పవైన అన్యగుణాలను కల్గినదానవు, వేంకటాద్రి విభుని ఇచ్ఛారూపిణివి, విలక్షణ అయిన నీవు నన్ను కటాక్షించడమనే సాహస కార్యంలో సామర్థ్యాన్ని కల్గి ఉన్నావు. (నన్ను రక్షించడం అనే సాహసాన్ని నీవు తప్ప ఎవరూ చేయరు.)

72. వృషగిరిపతేః హృద్యా విశ్వావతారసహాయినీ
క్షపితనిఖిలావద్యా దేవి ! క్షమాదినిషేవితా ।
భువనజననీ పుంసాం భోగాపవర్గవిధాయినీ
వితమసి పదే వ్యక్తిం నిత్యాం బిభర్షి దయే ! స్వయమ్ ॥

దయాదేవీ! శ్రీవేంకటేశ్వరునకు హృద్యమైనదానవు (హృదయంలో ఉన్న దానవు - హృదయప్రదేశంలో నివసించేదానవు), అన్ని అవతారాలలోను సహచారిణిగా ఉండేదానవు, అన్ని దోషాలను నశింపజేసే దానవు, క్షమ మొదలైనవారిచే సేవింపబడే (భూదేవి మొదలైన దేవేరులచే సేవింబడేదానవు), లోకాలకు తల్లివి, చేతనులకు ఇహలోకసుఖాలను, మోక్షాన్ని అనుగ్రహించే నీవు తమోగుణం లేని శ్రీవైకుంఠంలో స్వయంగా శాశ్వతమైన వ్యక్తిని (తిరుమేనిని కల్గి ఉన్నావు).

73. స్వయముదయినస్సిద్ధాద్యావిష్కృతాశ్చ శుభాలయాః
వివిధవిభవవ్యూహావాసాః పరం చ పదం విభోః ।
వృషగిరిముఖేష్వేతేష్విచ్ఛావధిప్రతిలబ్ధయే
దృఢవినిహితా నిశ్శ్రేణిస్త్వం దయే ! నిజపర్వభిః ॥

దయాదేవీ! స్వయంగా ఉదయించినవి (స్వయంవ్యక్తాలు), సిద్ధులు మొదలైన వారిచే ఆవిష్కరింపబడినవి అయిన దివ్యక్షేత్రాలు, వివిధాలైన విభవరూపాలు, వ్యూహరూపాలు వేంచేసి ఉండే ఆవాసాలు, పరవాసుదేవుని పరమపదం- వేంకటాచలం మొదలైన ఈ స్థానాలలో వారు వారు తమ తమ కోరికల అవధిలోని ఫలాలను (మనోరథాలను) పొందడంకోసం నీవు నీ పర్వాలతో (మెట్లతో) దృఢంగా అమర్చ బడిన నిచ్చెనవంటిదానివి.

74. హితమితి జగద్దృష్ట్యా క్లుప్తైరక్లుప్తఫలాంతరైః
అమతివిహితైరన్యైః ధర్మాయితైశ్చ యదృచ్ఛయా ।

పరిణతబహుచ్ఛద్మా పద్మాసహాయదయే ! స్వయం
ప్రదిశసి నిజాభిప్రేతం నః ప్రశామ్యదపత్రపా ॥

శ్రీనివాసుని దయాదేవీ ! లోకదృష్టిలో హితమని (పుణ్యమని) చెప్పబడే ప్రాసంగిక సుకృతాలతో, (నీచే) వేఱు ప్రయోజనాలను ఇచ్చేవిగా భావింపబడని ఆనుషంగిక సుకృతాలతో, తెలియకుండా (బుద్ధిపూర్వకంగా కాకుండా) చేయబడిన అజ్ఞాతసుకృతాలతో, యదృచ్ఛయా చేసినవి ధర్మంగా పరిణమించేది అయిన యాదృచ్ఛికపుణ్యాలతో, ఇంకా, వీటికంటే వేఱయిన సామాన్యబుద్ధి పూర్వక సుకృతాలతో పరిణమించిన పలు కారణాలను కల్గిన నీవు లజ్జను తొలగినదానివై, స్వయంగానే మేము మాకు కోరిన కోరికను అనుగ్రహిస్తున్నావు.

75. అతివిధిశివైరైశ్వర్యాత్మానుభూతిరసైః జనాన్
అహృదయమిహోపచ్ఛంద్యైషా మసంగదశార్థినీ ।
తృషితజనతా తీర్థస్నానక్రమక్షపితైనసాం
వితరసి దయే! వీతాతంకా వృషాద్రిపతేః పదమ్ ॥

దయాదేవీ! బ్రహ్మకు, శివునకు మించిన ఐశ్వర్యం, కైవల్యం- అనే వీటి ఆనందాలతోను చేతనులకు నీకు ఇష్టం లేకుండానే అనుగ్రహించి, వీరికి ఈ భోగాలలో సంగం తీరిన దశను కోరేదానివై, దాహాన్ని పొందిన జనసమూహాలు పుణ్యతీర్థాలతో స్నానం చేసే క్రమంలో, పాపాలు తీరిన వీరికి భయలజ్జాదులు లేనిదానివై శ్రీనివాసుని పదమైన మోక్షాన్ని ఇస్తున్నావు.

76. వృషగిరిసుధాసింధౌ జన్తుర్దయే ! నిహితస్త్వయా
భవభయపరీతాపచ్ఛిత్త్యై భజన్నఘమర్షణమ్ ।
ముషితకలుషో ముక్తైరగ్రేసరై రభిపూర్యతే
స్వయ ముపనతైః స్వాత్మానందప్రభృత్యనుబంధిభిః ॥

దయాదేవీ! సంసారంలో కలిగే భయాన్ని, తాపత్రాయాన్ని లేకుండా చేయం కోసం నీవు జీవుని వేంకటాద్రిపై ఉండే అమృతసముద్రంవంటి శ్రీనివాసునిలో చేరుస్తున్నావు. అఘమర్షణస్నానాన్ని (సర్వపాపప్రాయశ్చిత్తరూపమైన ప్రపత్తిని) అతనిచేత అనుష్ఠింపజేస్తూ అతని పాపాలను పోగొడుతున్నావు. అతడు ఈ లోకంలో ఉన్నంతవరకు పరమపదంలో అనుభవింపదగిన భోగాలను, ముముక్షువుల గోష్ఠిలో ఉండి పరమాత్మానుభవానందాన్ని పూర్ణంగా అతనికి కల్గిస్తున్నావు.

77. అనితరజుషామంతర్మాలేఽ ప్యపాయపరిప్లవే
కృతవిదనఘా విచ్ఛిద్యైషాం కృపే ! యమవశ్యతామ్ ।
ప్రపదనఫలప్రత్యాదేశ ప్రసంగవివర్జితం
ప్రతివిధిముపాధత్సే సార్థం వృషాద్రిహితైషిణా ॥

దయాదేవీ! అన్యులను ఆశ్రయించని, ఇతరఫలాలను కోరని ప్రపన్నులకు బుద్ధిపూర్వకంగా అపరాధం చేయడమనే సాంకర్యం కల్గినా, అంతకు ముందు అతడు చేసిన ప్రపత్తిని తెలిసిన కృతజ్ఞురాలవు, అతనిని దండించాలనే దోషం లేనిదానవు అయిన నీవు, ఇటువంటి ప్రపన్నులు యమునకు లోబడి బాధలను అనుభవించడమనే ఆపదను వారికి తొలగించి, వేంకటాద్రిలో ఉండే శ్రేయోభిలాషి అయిన శ్రీనివాసునితోపాటు కూడి ప్రపత్తికి ఫలమైన మోక్షప్రాప్తికి భంగం కల్గడమనే ప్రసంగం లేని ప్రతిక్రియను- అంటే - అల్పమైన దండనను- వారికి ఇస్తావు.

78. క్షణవిలయినాం శాస్త్రార్థానాం ఫలాయ నివేశితే
సురపితృగణే నిర్వేశాత్ ప్రాగపి ప్రళయం గతే ।
అధిగతవృషక్ష్మాభృన్నాథా మకాలవశంవదాం
ప్రతిభువ మిహ వ్యాచఖ్యుస్త్వాం కృపే ! నిరుపప్లవామ్ ॥

దయాదేవీ! క్షణకాలంలో నశించేవి శాస్త్రాలలో విధింపబడినవి అయిన యాగాది సత్కర్మల ఫలం ఇవ్వడంకోసం నియమింపబడిన దేవతల గణం, పితృ దేవతల గణం ఆ సత్కర్మఫలానుభవం పొందే లోగానే నశించిపోయినా, కాలానికి వశుడు కాని, ఏ ఉపద్రవాన్ని పొందని వేంకటేశ్వరుని పొందిన నిన్ను ఆ సత్కర్మ ఫలాన్ని ఇచ్చే విషయంలో ప్రతినిధిగా ప్రాజ్ఞులు చెప్పారు.

79. త్వదుపసదనాదద్య శ్వో వా మహాప్రళయేఽ పి వా
వితరతి నిజం పాదాంభోజం వృషాచలశేఖరః ।
తదిహ కరుణే ! తత్తత్క్రీడాతరంగపరంపరా
తరతమతయా జుష్టాయాస్తే దురత్యయతాం విదుః ॥

దయాదేవీ ! నిన్ను ఆశ్రయించినందువల్ల ఈ నాడు గాని, రేపు గాని, లేక మహాప్రళయంలో కాని వృషాచలానికి తలమానికమైన శ్రీనివాసుడు తన పాద పద్మాన్ని అనుగ్రహిస్తున్నాడు. అందువల్ల, ఆ యా కెఱటాలవంటి నీ లీలల పరంపరలోని తారతమ్యంతో కూడుకొన్న నిన్ను దాటిపోవడం ఎవరికీ సాధ్యం

కాదని విజ్ఞులు తెలిసికొంటున్నారు. (శ్రీనివాసుని దయాదేవిని ఆశ్రయిస్తే ఫలం తప్పక లభిస్తుంది.)

80. ప్రణిహితధియాం త్వత్సంపృక్తే వృషాద్రిశిఖామణౌ
ప్రస్రుమరసుధాధారాకారా ప్రసీదతి భావనా।
దృఢమితి దయే ! దత్త్వా స్వాదం విముక్తివలాహకం
నిభృతగరుతో నిధ్యాయంతి స్థిరాశయచాతకాః ॥

దయాదేవీ! నీతో గాఢమైన సంబంధాన్ని కల, వేంకటాద్రి శిఖరంలోని మణి వంటి వేంకటేశునితో దృఢంగా నిలుపుకొన్న మనస్సును కలవారికి చక్కగా స్రవించే అమృతధారవంటి భావన బాగా స్వచ్ఛంగా కల్గుతుంది. ఇది నిశ్చయం- అని, మనోహరమైన రసాస్వాదనను అనుగ్రహించేవాడు, విముక్తిని వర్షించే మేఘం వంటివాడైన శ్రీనివాసుని స్థిరమైన మనస్సును కల చాతకపక్షులవంటి ఉపాసకులు (ప్రపన్నులు) స్వప్రయత్నరూపమైన ఱెక్కల కదలికలను (కర్మజ్ఞానాదియోగా చరణాలను) లేనివారై, ఆ స్వామి మోక్షాన్ని ఇచ్చే సమయంకోసం వేచి ఉంటారు.

81. కృపే ! విగతవేలయా కృతసమగ్రపోషైస్త్వయా
కలిజ్వలనదుర్గతే జగతి కాలమేఘాయితమ్।
వృషక్షితిధరాదిషు స్థితిపదేషు సానుప్లవైః
వృషాద్రిపతి విగ్రహైః వ్యపగతాఖిలావగ్రహైః ॥

దయాదేవీ! కాలనియతి లేని నీ కారణంగా సర్వదేశ-సర్వకాల- సర్వావస్థలలో సర్వప్రాణులను పోషించే, నిగ్రహాన్ని లేని వేంకటాచలం మొదలైన భగన్నివాసస్థలాలలో అనుచరులతో కూడిన శ్రీనివాసుని దివ్యమంగళరూపాలు కలిపురుషునివల్ల దుర్గతిని పొందిన ఈ జగత్తును, సమస్తజీవులను పోషించే, కలువు కాటకాలను తీర్చే, అను కూలవాతాదులలో కూడిన కాలమేఘాలు అగ్నిచే దుర్దశను పొందిన దేశాన్నివలె రక్షిస్తున్నవి. (దయాదేవిచేత ప్రేరితుడైన శ్రీనివాసుడు వేంకటాచలంవంటి క్షేత్రాలలో అర్చారూపిగా వెలసి, కాలమేఘంవలె జగత్తును రక్షిస్తున్నాడు.)

82. ప్రసూయ వివిధం జగత్తత్ తదభివృద్ధయే త్వం దయే!
సమీక్షణవిచింతన ప్రభృతిభిః స్వయం తాదృశైః।
విచిత్రగుణచిత్రితాం వివిధదోషవైదేశికీం
వృషాచలపతేః స్తనుం విశసి మత్స్యకూర్మాదికామ్ ॥

దయాదేవీ ! నీవు నానారూపమైన జగత్తును ప్రసవించి (కని), స్వయంగా ఆ జగత్తును కటాక్షించడం, ధ్యానించడం మొదలైన ప్రక్రియలతో ఆ జగత్తు అభివృద్ధి చెందడంకోసం అద్భుతాలైన గుణాలతో చిత్రమైన, అనేకదోషాలకు దూరమైన, వేంకటేశ్వరుని అవతారరూపమైన మత్స్యకూర్మాది రూపమైన తనువులో ప్రవే శిస్తున్నావు. (జగత్తును సృష్టిచేసిన తరువాత దాని అభివృద్ధికోసం దయాదేవి భగవానుని మత్స్యకూర్మాది రూపాలలో అనుప్రవేశిస్తుంది - ఈ శ్లోకంలో మత్స్య, కూర్మావతారాలు రెండు స్తుతింపబడ్డాయి.)

83. యుగాంతసమయోచితం భజతి యోగనిద్రారసం
వృషక్షితిభృదీశ్వరే విహరణక్రమాజ్జాగ్రతి।
ఉదీర్ణచతురర్ణవీ కదనవేదినీం మేదినీం
సముద్ధృతవతీ దయే ! త్వదభిజుష్టయా దంష్ట్రయా ॥

దయాదేవీ ! నీవు, యుగాంతకాలానికి తగిన యోగనిద్రాసుఖాన్ని అనుభవించే వేంకటాద్రివిభుడు విహరణక్రమంలో మేల్కొన్నపుడు పొంగి ప్రవహించే నాల్గు సముద్రాలచేత ఏర్పడిన పీడను తెలియజేసే భూమిని నీవు అనుప్రవేశించిన కోరదంతంతో పైకి ఉద్ధరించేటట్లు చేశావు. (దయాదేవి అనుప్రవేశించిన వరాహ మూర్తిదంష్ట్రచే భూమి ప్రళయసముద్రంనుండి ఉద్ధరింపబడింది).

84. సటాపటలభీషణే సరభసాట్టహాసోద్భటే
స్ఫురత్క్రుధి పరిస్ఫుటత్భ్రుకుటికేఽపి వక్త్రే కృతే।
దయే! వృషగిరీశితుర్దనుజడింభదత్తస్తనా
సరోజసదృశా దృశా సముదితాకృతిర్దృశ్యసే ॥

శ్రీవేంకటేశుని దయాదేవీ ! సటల (జూలు) సమూహంతో భయంకరమైనది, వేగంతో కూడినది, అట్టహాసాలతో ఉద్ధతమైనది, బాగా వ్యక్తం అవుతున్న కనుబొమల వక్రతను కల్గినది అయిన నృసింహమూర్తివదనం స్ఫురించే కోపం కల్గినది అయినా, పద్మంతో సమానమైన కంటిచూపుతో అసురబాలకుడైన ప్రహ్లాదునకు స్తన్యాన్ని ఇచ్చే (అసురబాలకుని పట్ల వాత్సల్యాన్ని చూపే) ఆకారంతో నీవు ఆవిర్భవించావు. (హిరణ్యునకు నృసింహుని ముఖం ఉగ్రంగా ఉన్నా, ప్రహ్లాదునకు దయాప్రభావంచేత కమలసుమసదృశమైన కటాక్షాన్ని కల్గినదై వాత్సల్యాతిశయంతో శోభిస్తున్నది.)

85. ప్రసక్తమధునా విధిప్రణిహితైస్సపర్యోదకైః
సమస్తదురితచ్ఛిదా నిగమగంధినా త్వం దయే ।
అశేషమవిశేషతస్త్రి జగదంజనాద్రీశితుః
చరాచరమచీకరశ్చరణ పంకజేనాంకితమ్ ॥

దయాదేవీ! నీవు చతుర్ముఖబ్రహ్మచే అర్చనావిధిలో సమర్పించబడిన జలం చేత, తేనెను స్రవించే, సకలపాతకాలను ఛేదించే, వేదాల పరిమళం కల్గిన (వేదాలచే కీర్తింపబడ్డ) శ్రీనివాసుని చరణపద్మంచేత జంగమస్థావరరూపమైన ముల్లోకాలను సంపూర్ణంగా ఏ తారతమ్యం లేకుండా అంకితం చేశావు (శ్రీనివాసుడు త్రివిముక్రముడైనపుడు దయాదేవి ఆ స్వామి పాదారవిందంతో ముల్లోకాలను ముద్రింపజేసి, అవి ఆ స్వామి సొత్తు - అని వ్యక్తం చేసింది.)

86. పరశ్వథతపోధన ప్రథనసత్క్రతూపాకృత-
క్షితీశ్వరపశుక్షరత్ క్షతజకుంకుమస్థాసకైః ।
వృషాచలదయాళునా నను విహర్తుమాలిప్యథాః
నిధాయ హృదయే దయే ! నిహతరక్షితానాం హితమ్ ॥

దయాదేవీ ! వృషాద్రిలోని దయాస్వభావుడైన శ్రీనివాసునిచేత వధింపబడి, తద్వారా రక్షింపబడినవారి హితాన్ని మనస్సులో ఉంచుకొని (భావించి), విహరించడంకోసం గండ్రగొడ్డలిని ఆయుధంగా కల్గిన ముని అయిన పరశురాముడు చేసిన యుద్ధమనే ఉత్తమక్రతువులో బలి ఇవ్వబడిన ప్రభువులనే యాగపశువుల నుండి స్రవించే రక్తం అనే కుంకుమద్రవ్యాలతో పూయబడినదానవు అయినావు. (దయాదేవి శ్రీనివాసునితో విహరించదలచి దుష్టక్షత్రియుల రక్తాన్ని మయమ పంకంగా పూయించుకొన్నది.)

(దుష్టక్షత్రియసంహారం అనే క్రతువుద్వారా లోకకల్యాణాన్ని చేసిన పరశురామావతారం దయాదేవి కృత్యం దుష్టులైనా యుద్ధంలో వధింపబడ్డ క్షత్రియులు స్వర్గలోకసౌఖ్యాన్ని పొందుతారు కనుక ఆ విధంగా వారిని వధించడం హితకార్యమే. వారిని వధించడంలో వారి దౌష్ట్యం అంతమవుతుంది కనుక వారి వధ హితకార్యమే. ఇటువంటి దయాకార్యమైన దుష్టక్షత్రియనిబర్హణం తరువాత వారి హితాన్ని కోరి దయాదేవితో కలసి శ్రీనివాసప్రభువు విహరించడంకోసం క్షత్రియుల రక్తాన్ని ఆమెకు అంగరాగంగా పూసి విహరించాడు.)

87. కృపే ! కృతజగద్ధితే ! కృపణజంతుచింతామణే !
రమాసహచరం తదా రఘుధురీణయంత్యా త్వయా ।
వ్యభజ్యత సరిత్పతిః సకృదవేక్షణాత్తత్క్షణాత్
ప్రకృష్టబహుపాతక ప్రశమహేతునా సేతునా ॥

లోకాల హితాన్ని కోరేదానివి, దీనజనులకు చింతామణివంటిదానివి అయిన ఓ దయాదేవీ! లక్ష్మీసహచరుడైన శ్రీనివాసుని అపుడు రఘుకులపుంగవునిగా అవతరింపజేసిన నీవు ఒక్క పర్యాయం కటాక్షించడంవల్ల తత్క్షణం అనేకవిధాలైన ప్రబలపాపాలను పోగొట్టడానికి కారణమైన సేతువుతో సముద్రుడు అని రెండుగా విభజించబడ్డాడు. (శ్రీరామావతారం ఆ అవతారంలో దర్శనమాత్రంతోనే పాపాలను హరించే సేతునిర్మాణం- దయాగుణమూలకమే.)

88. కృపే ! పరవతస్త్వయా వృషగిరీశితుః క్రీడితం
జగద్ధితమశేషత స్తదిదమిత్థ మర్థాప్యతే ।
మదచ్ఛలపరిచ్యుత ప్రణతదుష్కృతప్రేక్షితైః
హతప్రబలదానవైర్హలధరస్య హేలాశతైః ॥

దయాదేవీ! నీకు విధేయుడైన బలరాముడై అవతరించిన శ్రీనివాసుని లీల అంతా జగత్తు శ్రేయస్సుకోసమే. తాను మద్యం తాగడమనే సాకుతో శరణాగతుల పాపాలను అతడు గమనించడంలేదు. తన ఆయుధమైన హలంతో ప్రలంబాది ప్రబలదానవులను సంహరించాడు. ఈ విధంగా బలరాముని ఆయా లీలలు అన్నీ లోక హితాలుగా నిరూపింపబడ్డాయి.

89. ప్రభూత విబుధద్విషద్భరణఖిన్నవిశ్వంభరా-
భరాపనయనచ్ఛలాత్త్వ మవతార్య లక్ష్మీధరమ్ ।
నిరాకృతవతీ దయే ! నిగమసౌధదీపశ్రియా
విపశ్చిదవిగీతయా జగతి గీతయాఽఽంధంతమః ॥

ఓ దయాదేవీ ! పెక్కుమంది దేవతలకు శత్రువులైన అసురులను భరించడం చేత, వారి భారాన్ని మోయలేక, దుఃఖాన్ని పొందిన భూదేవి భారాన్ని తొలగించడమనే నెపంతో శ్రీనివాసుని నీవు శ్రీకృష్ణునిగా అవతరింపజేసి, వేదాంతభవనానికి దీపకాంతి వంటిది, పండితులచే కీర్తింపబడేది అయిన భగవద్గీతతో లోకంలోని గాఢమైన, అజ్ఞానమనే చీకటిని అంతరింపజేశావు (భగవానుని శ్రీకృష్ణావతారం, ఆ అవతారంలో స్వామి గీతాజ్యోతిని ప్రకాశింపజేయడం దయాగుణమూలకమే.)

90. వృషాద్రిహయసాదినః ప్రబలదోర్మరుత్ప్రేంఖితః
త్విషా స్ఫుటతటిద్గుణః త్వదవసేక సంస్కారవాన్ ।
కరిష్యతి దయే ! కలిప్రబలఘర్మనిర్మూలనః
పునః కృతయుగాంకురం భువి కృపాణధారాధరః ॥

దయాదేవీ! వృషాచలంలోని శ్రీనివాసుడనే గుఱ్ఱపు రౌతుయొక్క (ఖడ్గం ధరించిన) బలిష్ఠమైన బాహువు కదలికలచేత పుట్టిన గాలివల్ల చలింపజేయబడిన, తన కాంతితో మెఱిసే మెఱుపుతీగవలె ఉన్నది, నీచేత (తైలం, నేయివంటి ద్రవ్యాలతో) తడుపబడడమనే సంస్కారాన్ని కల్గినది అయిన ఖడ్గమనే మేఘం, కలిపురుషునివల్ల కల్గిన ప్రబలమైన గ్రీష్మకాలతాపాన్ని నిర్మూలిస్తున్నదై, మళ్ళీ తిరిగి ఈ భూలోకంలో కృతయుగంయొక్క అంకురాన్ని మొలిపించగలదు. (జరుగబోయే కల్క్యవతారం, ఆ అవతారంలో భగవానుడు చేసే కలిసంహారం, కలియుగాంతంలో సంభవించే కృతయుగారంభం- అన్నీ దయాకార్యాలే).

91. విశ్వోపకారమితి నామ సదా దుహానా
మద్యాపి దేవి ! భవతీ మవధీరయంతమ్ ।
నాథే నివేశయ వృషాద్రిపతేర్దయే ! త్వం
న్యస్తస్వరక్షణభరం త్వయి మాం త్వయైవ ॥

శ్రీవేంకటేశ్వరుని దయాదేవీ! ఈ విధంగా జగత్తుకు అన్ని విధాలైన ఉపకారాలను ఎల్లప్పుడు చేసే నిన్ను ఇపుడుకూడా తిరస్కరిస్తున్నవాడను, నీ చేతనే నీపై సమర్పించబడిన నా రక్షణభారాన్ని కలవాడను అయిన నన్ను నీవే నాథుడైన భగవానునితో చేర్చు. (సకలవిధాలైన ఉపకారాలను చేసేది, నా రక్షణభారాన్ని స్వీకరించిన దయాదేవి నన్ను శ్రీనివాసునివద్దకు చేర్చాలి)

92. నైసర్గికేణ తరసా కరుణే ! నియుక్తా
నిమ్నేతరేఽపి మయి తే వితతిర్యది స్యాత్ ।
విస్మాపయే ద్వృషగిరీశ్వరమప్యవార్యా
వేలాతిలంఘనదశేవ మహాంబురాశేః ॥

దయాదేవీ! సహజమైన వేగంతో ప్రేరేపింపబడినది, అందువల్లనే మహా సముద్రంయొక్క చెలియలికట్టను అతిక్రమించే స్థితివలె అడ్డగించడానికి సాధ్యం కానిది అయిన నీ విస్తారమైన ప్రవాహం మిట్టగా ఉండే (నమ్రత ఏమాత్రం లేని) నాపైకూడా ప్రసరిస్తే వృషగిరినాథునకుకూడా విస్మయాన్ని కల్గిస్తుంది. (దురభిమానాన్ని కలవారిని సైతం దయాదేవి కటాక్షించడం శ్రీనివాసుని విస్మయపరుస్తుంది.)

93. విజ్ఞాతశాసనగతిర్విపరీతవృత్త్యా
వృత్రాదిభిః పరిచితాం పదవీం భజామి ।
ఏవంవిధే వృషగిరీశదయే ! మయి త్వం
దీనే విభో శ్శమయదండధరత్వలీలామ్ ॥

వృషాద్రివిభుని దయాదేవీ ! శాస్త్రంలో చెప్పబడిన (పాపాల) దండన ప్రకారాన్ని తెలిసినా నేను, శాస్త్రవిరుద్ధమైన ప్రవర్తనతో వృత్రాసురుడు మొదలైనవారు నడచిన దారిలో నడుస్తున్నాను. ఇటువంటి చెడ్డవర్తనను కల, దాసుడనైన నన్ను ప్రభువైన శ్రీనివాసుడు దండించకుండా ఉండేటట్లు కాపాడు.

94. మా సాహసోక్తి ఘనకంచుకవంచితాన్యః
పశ్యత్సు తేషు విదధామ్యతిసాహసాని ।
పద్మాసహాయకరుణే ! న రుణత్సి కిం త్వం
ఘోరం కుళింగశకునేరివ చేష్టితం మే ॥

శ్రీనివాసుని దయాదేవీ ! "సాహసం చేయవద్దు"- అని ఉపదేశించే మాట అనే దృఢమైన కవచంతో ఇతరులను మోసగించే నేను నాచే అటువంటి మాటలతో వంచింపబడ్డ ఆ జనులు చూస్తూ ఉండగానే నా ఉపదేశానికి విర్ధుంగా సహజకృత్యాలను చేస్తున్నాను. కులింగ (కళింగ) పక్షి చేసే కృత్యంవలె దారుణమైన నా కృత్యాన్ని నీవు ఎందుకు అడ్డగించడం లేదు. (కుళింగపక్షి కూసే కూతలో- "సాహసం చేయవద్దు. ఆపదల పాలు కావద్దు" అనే ఉపదేశం ధ్వనిస్తుంది. దాని ధ్వనిని విన్న జనం అది ఎంతో మంచి పక్షి అని భావిస్తారు. దాని ఉపదేశాన్ని ఆచరించాలని అనుకుంటారు. కాని, ఆ పక్షి జనం చూస్తూ ఉండగానే నిద్రించే సింహం ఆవలించిన సమయంలో హఠాత్తుగా దాని నోటిలో దూరి, దాని కోరల నడుమ చిక్కుకొని ఉండే మాంసపు ముక్కలను ముక్కుతో పొడిచి, అది నోరు మూయడానికి ముందే బయటలకు తీసుకొనివచ్చి తింటుంది. ఇంతటి సాహసాన్ని చేసే కుళింగపక్షి ఇతరులకుమాత్రం సాహసం చేయవద్దని ఉపదేశించడం అబ్బురం).

95. విక్షేపమర్హసి దయే ! విఫలాయితేఽపి
వ్యాజం విభావ్య వృషశైలపతే ర్విహారమ్ ।

స్వాధీనసత్త్వసరణిః స్వయమత్ర జంతౌ
ద్రాఘీయసీ దృఢతరా గుణవాగురా త్వమ్ ॥

దయాదేవీ! సత్త్వగుణాన్ని అధీనంలో కలదానవు, ఎంతదూరమైనా వ్యాపించే దానవు, కల్యాణగుణాలనే దారాలను కల్గినదానవు అయిన నీవు, జంతువుల ప్రవర్తనను స్వాధీనం చేసికొనగల్గినది, గట్టిగా నిర్మింపబడినది, దూరంలో ఉండే జంతువులను కూడా బంధించగల్గినంతటి దీర్ఘమై ఉన్నది అయిన వలవలె ఉన్నావు. దూరంగా పరుగెత్తే జంతువువంటి నన్ను, సంసారంలోని జీవులను పట్టడంకోసం వేంకటాద్రిపై వేంచేసి ఉండే శ్రీనివాసుని లీలను (వేటను) నెపంగా చేసికొని నాపై ప్రసరించి నన్ను పట్టుకొని స్వామికి అప్పగించడానికి తగినదానవు. (క్రూరజంతువులను బంధించే వలవంటి దయాదేవి జంతువుతో సమానమైన నన్ను పట్టుకొని శ్రీనివాసునకు అప్పగించడం తగినది.)

96. సంతన్యమాన మపరాధగణం విచింత్య
త్రస్యామి హంత! భవతీం చ విభావయామి ।
అహ్నాయ మే వృషగిరీశదయే ! జహీమామ్
ఆశీవిషగ్రహణ కేళినిభా మవస్థామ్ ॥

శ్రీనివాసుని దయాదేవీ ! నిరంతరం చేయబడే నా అపరాధాల సమూహాన్ని తలచి భయపబడుతున్నాను. నిన్ను వెంటనే స్మరించి అభయాన్ని పొందుతున్నాను. ఆశ్చర్యం ! పామును పట్టి, దానితో ఆటలాడడంతో సమానం అయిన నా ఈ దురవస్థను శీఘ్రంగా పోగొట్టు. (ప్రపత్తిని చేసిన తరువాత అపరాధాలను చేసే దుర్దశను తొలగించు).

97. ఔత్సుక్యపూర్వ ముపహృత్య మహాపరాధాన్
మాతః ! ప్రసాదయితు మిచ్ఛతి మే మనస్త్వామ్ ।
ఆలిహ్య తాన్నిరవశేష మలబ్ధతృప్తిః
తామ్యస్యహో ! వృషగిరీశధృతా దయే ! త్వమ్ ॥

తల్లీ ! దయాదేవీ ! నామనస్సు ఎంతో ఉత్సుకతతో గొప్ప గొప్ప అపరాధాలను నీకు కానుక ఇచ్చి నన్ను తృప్తి పఱచాలని కోరుతున్నది. వేంకటాచలపతిచేత ధరింపబడే నీవు ఆ అపరాధాలను పూర్తిగా నాలుకతో నాకి (ఆప్యాయతతో-వాత్సల్యంతో గ్రహించి), ఇంకా తృప్తిని పొందకుండా బాధపడుతున్నావే ! ఇదేమి

ఆశ్చర్యం ! (ప్రపన్నులు చేసే ఎంతటి మహాపరాధాలను అయినా క్షమించి, వారికి ఎంత అనుగ్రహించినా, ఇంకా తగినది ఏమీ చేయలేక పోయానని తహతహలాడడం దయాదేవి స్వభావం.)

98. జహ్యాద్వృషాచలపతిః ప్రతిఘేఽపి న త్వాం
ఘర్మోపతప్త ఇవ శీతలతా ముదన్వన్ ।
సా మా మరుంతుదభర వ్యసనానువృత్తిః
తద్వీక్షణైః స్పృశ దయే! తవ కేళిపద్మైః ॥

ఓ దయాదేవీ ! శ్రీనివాసుడు కోపంలోకూడా, గ్రీష్మకాలతాపంచేత తపింపబడ్డ సముద్రం చల్లదనాన్ని విడువనట్లు, నిన్ను విడువడు- ఎందుకు అంటే ఎల్లప్పుడు శ్రీనివాసుని ఎదలో నీవు ఉంటావు. ఒకసారి ప్రపత్తి చేసినంతలోనే అన్ని ఫలాలను ఇచ్చే నీవు మాటిమాటికి ప్రపత్తి చేయడాన్ని సహించలేవు. అందువల్ల నేను చేసే పునఃశరణాగతిని అనే అరుంతుదవృత్తిని (మర్మస్థానాన్ని బాధించే పనిని క్షమించి, నీ లీలాపద్మాలవంటి ఆ శ్రీనివాసుని కటాక్షాలతో నన్ను స్పృశించు. (శ్రీనివాసుని కటాక్షాలకు పాత్రుణ్ణిగా చేయి).

99. దృష్టేఽపి దుర్బలధియం దమనేఽపి దృప్తం
స్నాత్వాఽపి ధూళిరసికం భజనేఽపి భీమమ్ ।
బద్ధ్వా గృహాణ వృషశైలపతేర్దయే ! మాం
త్వద్వారణం స్వయమనుగ్రహశృంఖలాభిః ॥

శ్రీనివాసుని దయాదేవీ ! (భగవానునిచే) కటాక్షింపబడినా దుర్బలమైన బుద్ధిని కలవాడను, శిక్షింపబడినా దర్పాన్ని కలవాడను, అందువల్ల స్నానం చేసినా దుమ్మును పూసికోవడంలో ప్రీతిని కల, భయంకరమైన నీ ఏనుగువంటి (నిన్ను అడ్డగించే) నన్ను స్వయంగా నీవే నీ అనుగ్రహమనే సంకెలతో బంధించి పట్టుకో.

100. నాథః పరం కిమపి మే త్వయి నాథనీయం
మాతర్దయే ! మయి కురుష్వ తథా ప్రసాదమ్ ।
బద్ధాదరో వృషగిరిప్రణయీ యథా సా
ముక్తానుభూతిమిహ దాస్యతి మే ముకుందః ॥

ఓ దయాదేవీ ! వేంకటాద్రిలో ప్రీతిని కల ఈ ముకుందుడైన శ్రీనివాసుడు బద్ధచేతనులపట్ల ఆదరాన్ని కలవాడై ఈ తిరుమలలో ముక్తానుభవాన్ని నాకు

అనుగ్రహించే విధంగా నన్ను కటాక్షించు. ఇంతకంటే ఇంకొకటి నీవల్ల యాచింప దగినది ఏదీ నాకు లేదు.

101. నిస్సీమవైభవజుషాం మిషతాం గుణానాం
స్తోతుర్దయే ! వృషగిరీశగుణేశ్వరీం త్వామ్ ।
తైరేవ నూనమవశై రభినందితం మే
సత్యాపితం తవ బలాదకుతోభయత్వమ్ ॥

ఓ దయాదేవీ ! అంతు లేని వైభవాన్ని కల జ్ఞాన-ఐశ్వర్యాది గుణాలు చూస్తూ ఉండగా, వేంకటాద్రినాథుని గుణాలకు రాణివి అయిన నిన్ను స్తుతించే నేను పారవశ్యాన్ని పొందిన ఆ గుణాలచేతనే అభినందింపబడ్డాను. అందువల్లనే నీబలం వల్ల ఎవరినుండికూడా భయం లేనితనం నాకు ఉండడం నిజమని రూపింపబడింది. ఇది నిశ్చయం. (భగవానుని అన్ని గుణాలలో సార్వభౌమివి అయిన నిన్ను స్తుతించిన నన్ను ఆ గుణాలు అభినందించాయి. నీ బలంవల్ల ఇక ఎవరివల్ల, దేనివల్ల భయం లేని స్థితి నాకు కల్గిందనే సత్యం ఋజువైనది.

102. అద్యాపి తద్వృషగిరీశదయే ! భవత్యా
మారంభ మాత్ర మనిదం ప్రథమస్తుతీనామ్ ।
సందర్శిత స్వపరనిర్వహణా సహేథాః
మందస్య సాహసమిదం త్వయి వందినో మే ॥

వేంకటేశుని దయాదేవీ! అనాది అయిన వేదమనే స్తుతులు ఈనాటికీ నిన్ను స్తుతించే ఆరంభం మాత్రమే చేయగలిగాయి. (పూర్తి చేయలేకపోయాయి) అందువల్ల నీ విషయంలో మందబుద్ధిని గల స్తుతిపాఠకుడను అయిన (నిన్ను పూర్తిగా స్తుతించలేని) నా ఈ సాహసాన్ని, నిన్ను ఇతరులను నిర్వహించగలిగే నీవు క్షమించాలి (నా వైభవానికి అల్పస్తుతిద్వారా కొఱత కల్గించిన నన్ను క్షమించాలి.)

103. ప్రాయో దయే ! త్వదనుభావమహాంబురాశౌ
ప్రాచేతసప్రభృతయోఽపి పరం తటస్థాః ।
తత్రావతీర్ణ మతలస్పృశమాప్లుతం మాం
పద్మాపతేః ప్రహసనోచిత మాద్రియేథాః ॥

ఓ దయాదేవీ! నీ మహిమ అనే మహాసముద్రంలో వాల్మీకి మొదలైనవారు కూడా దాని లోపలకు దిగలేక ఇంచుమించుగా తీరాన నిలిచినవారు మాత్రమే

కాగలిగారు. అటువంటి ఆ సముద్రంలో దిగినవాడను, అట్ట అడుగును స్పృశించని వాడనై పైపైన తేలుతున్నవాడను, అందువల్లనే శ్రీనివాసుని పరిహాసానికి పాత్రమైన వాడనైన నన్ను ఆదరించు.

104. "వేదాన్తదేశిక" పదే వినివేశ్య బాలం
దేవో "దయాశతక"మేతదవాదయన్మామ్ ।
వైహారికేణ విధినా సమయే గృహీతం
వీణావిశేషమివ వేంకటశైలనాథః ॥

వేంకటాద్రి విభుడైన దేవుడు బాలుడనైన నన్ను వేదాంతదేశికస్థానంలో ఉంచి, విహారార్థమైన రీతితో (క్రీడావిధితో) ఒకానొక సమయంలో, తన చేతిలోని వీణను పల్కినట్లు, నాచేత ఈ దయాశతకాన్ని పల్కించాడు. (శ్రీనివాసుడే స్వయంగా నన్ను ఉపకరణంగా చేసికొని ఈ దయాశతకాన్ని రచింపజేశాడు.)

105. అనవధి మధికృత్య శ్రీనివాసానుకంపా
మవితథవిషయత్వాత్ విశ్వమవ్రీడయంతీ ।
వివిధకుశలనీవీ వేంకటేశప్రసూతా
స్తుతిరియ మనవద్యా శోభతే సత్త్వభాజామ్ ॥

అంతు లేని శ్రీనివాసుని దయను ఉద్దేశించి శ్రీవేంకటనాథునివల్ల ఉదయించినది, సత్యమైన విషయాన్ని కల్గి ఉన్నందువల్ల ప్రపంచాన్ని సిగ్గు పడకుండా చేసేది, సకలవిధక్షేమాలకు మూలధనమైనది, దోషరహితమైనది అయిన స్తుతి సాత్త్వికులకు ఆనందాన్ని ఇస్తుంది.

106. శతకమిద ముదారం సమ్యగభ్యస్యమానాన్
వృషగిరిమధిరుహ్య వ్యక్తమాలోకయంతీ ।
అనితరశరణానా మాధిరాజ్యేఽభిషించేత్
శమితవిమతపక్షా శార్ఙ్గధన్వానుకంపా ॥

వేంకటాద్రిని అధిరోహించి స్పష్టంగా చూచే శ్రీనివాసునియొక్క దయ ఉదార మైన (గొప్పది అయిన) ఈ దయాశతకాన్ని చక్కగా అభ్యసించేవారి శత్రుపక్షాలను శమింపజేసి, అనన్యశరణులైన ప్రపన్నుల మోక్షసామ్రాజ్యంలో వారిని అభిషేకిస్తుంది.

107. విశ్వానుగ్రహమాతరం వ్యతిషజత్స్వర్గాపవర్గాం సుధా
సధ్రీచీమితి వేంకటేశ్వరకవిర్భక్త్యా దయా మస్తుత ।

పద్యానామిహ యద్విధేయభగవత్సంకల్ప కల్పద్రుమాత్
ఝంఝామారుత ధూతచూతనయతః సాంపాతికోఽయం క్రమః ॥

అందరికి అన్నిటిని అనుగ్రహించే తల్లి, వారి వారి కోరికలనుబట్టి స్వర్గప్రాప్తి రూప ఐహికఫలాలను, మోక్షఫలాన్ని అనుగ్రహించేది, అమృతంతో సమానమైనది అయిన దయను ఈ విధంగా వేంకటనాథకవి భక్తితో స్తుతించారు. ఈ శతకంలోని శ్లోకాల ఈ క్రమం దయాదేవీవిధేయుడైన శ్రీనివాసుని సంకల్పమనే కల్పవృక్షం నుండి, పెనుగాలివల్ల మామిడిచెట్టునుండి పండ్లు రాలే రీతిలో, దైవికంగా ఏర్పడింది. (ఈ శ్లోకక్రమం నేను నా ప్రయత్నంతో చేసినది కాదు. దైవసంకల్పాధీనం)

108. కామం సంతు మిథః కరంబితగుణావద్యాని పద్యాని నః
కస్యాస్మిన్ శతకే సదమ్బుకతకే దోషశ్రుతిం క్షామ్యతి ।
నిష్ప్రత్యూహ వృషాద్రినిర్ఝరఝరత్కారచ్ఛలేనోచ్ఛలన్
దీనాలంబనదివ్యదమ్పతిదయా కల్లోలకోలాహలః ॥

మా ఈ పద్యాలు గుణాలను, దోషాలను కల్గినవి అయితే కానీ. నిరాటంకంగా వేంకటాద్రిలో ప్రవహించే గొప్ప కొండవాగుల ధ్వని అనే నెపంతో విజృభించే దీనులకు ఆశ్రయమైన దివ్యదంపతుల దయాతరంగాల కోలాహలం వంటిది అయిన, సాధువుల మనస్సు అనే జలాన్ని తేటపఱచే చిల్లగింజవంటి ఈ శతకం ఎవరు పలికే దోషాలను సహించదు. (ఇందులోని దోషాలనుగూర్చి పలికేవారి మాటలను భగవానుని దయాప్రవాహమనే కొండవాగుల ధ్వని వినరాకుండా చేస్తుంది. ఈ దయాదేవి. వారి దూషణలను విని సహిస్తుంది తప్ప, వారిని దండించదు.)

Printed at TTD Press, Tirupati. C.2,000-Free Booklet-2011-(VKS)